
**చెత్త తరలింపు వాహనాలు సమయానికి ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు చేరుకోవాలి**




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

**కుల విద్వేషాల బలికి పసిబిడ్డ ప్రాణం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి**




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 60 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 26 ఫిబ్రవరి 2026

### వేంపల్లె నందీశ్వరాలయంలో

## విగ్రహ ప్రతిష్ట

**- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైఎస్ జగన్**




**పులివెందుల, 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** వైసిపి అధినేత వైఎస్ జగన్ రెండో రోజు పులివెందులలో పర్యటించారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం 10.30 గంటలకు వేంపల్లి మండలం నందిపల్లి నందీశ్వర ఆలయాన్ని

మిగతా2లో...

## యూత్ కాంగ్రెస్ నేతల అరెస్ట్ సిగ్గుచేటు

**- కేంద్రం చర్యను తప్పపట్టిన ప్రియాంక**




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇటీవల ఢిల్లీలో జరిగిన ఎఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ యువ నేతలు భారత్– అమెరికా ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ చొక్కాలు విప్పి నిరసన తెలిపారు. సమ్మిట్‌లో నిరసన చేసిన కాంగ్రెస్ నేతల్ని పోలీసులు అరెస్టు చేయడాన్ని కాంగ్రెస్ నేత, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా బుధవారం తీవ్రంగా ఖండించారు. ఈ అరెస్టు సిగ్గుచేటని ఆమె ధ్వజమెత్తారు. 'సత్యం కోసం, శాంతియుత, అహింసాయుత ప్రతిఘటన

మిగతా2లో...

## ఉగ్రవాదంపై పోరులో ఇజ్రాయెల్‌కు పూర్తి అండ

**- ఇజ్రాయిల్ పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రసంగం**



**న్యూఢిల్లీ, 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం ఇజ్రాయెల్ వెళ్లిన సంగతి తెలిసిందే. పర్యటనలో భాగంగా బుధవారం ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రసంగించిన

మిగతా2లో...

# ఆర్థిక మూలాలు పెంచేలా చేయాలి

- పశుసంవర్ధకశాఖను అభివృద్ధి పరచాలి
- కొత్త ఆలోచనలతోనే పశుసంవర్ధక శాఖలో మార్పులు
- బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- అధికారులతో మంత్రి వాకిటి శ్రీహరి సమీక్ష







**హైదరాబాద్,ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** పాడి పరిశ్రమ పరిపూర్ణంగా ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించేలా నివేదికలు తయారు చేయండని మంత్రి సూచించారు. ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వ పథకాలను రూపొందించాలన్నారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి హర్యానా, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల మోడల్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పశుసంవర్ధక, పాడి పరిశ్రమలో ఏం చేస్తే సక్సెస్ అవుతామో అధ్యయనం చేయాలన్నారు. ఆరోగ్యకరమైన తెలంగాణను నిర్మిస్తేనే భవిష్యత్ బాగుంటుందని, అందుకోసం స్వచ్ఛమైన పాలు, బలమైన పోషకాలు ఉన్న చికెన్, మటన్, చేపల ఉత్పత్తి చేయాలన్నారు. ఉన్నతాధికారులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ బాధ్యతతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. ఆర్థిక స్వావలంబన లభించే పథకాలను రూపొందించి అమలుచేద్దాం

మిగతా2లో...

### న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే

# సహించబోం..

- పాఠ్యాంశంపై తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు
- వెంటనే తొలగిస్తామని ప్రకటించిన కేంద్రం



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎన్‌సీఈ ఆర్‌టీ 8వ తరగతి పాఠ్యాంశంలో 'న్యాయ వవస్థలో అవినీతి' అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు సీరియస్ కావడంతో కేంద్రం వెంటనే స్పందించింది. పాఠ్యాంశం లోని భాగాలను తొలగించేందుకు నిర్ణయించింది. పాఠ్యాంశంలో ఆవిధంగా వచ్చి ఉండాల్సింది కాదని, దీనికి బదులు స్ఫూర్తిదాయకమైన విషయాలను రాసి ఉండాల్సిందని కేంద్రం అభిప్రాయపడినట్టు ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి. ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యాశంలో న్యాయవ్యవస్థలో అవినీతి అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు బుధవారంనాడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారం న్యాయవాదులు, న్యాయమూర్తులందరినీ కలవరానికి గురి చేసిందని,

మిగతా2లో...

## జీనుగురాలలో పల్లె ప్రకృతి వనంలో 200 చెట్ల నరికివేత

**- ప్రకృతి వనాలపై పగబట్టడం దుర్మార్గమైన చర్య అన్న కెటిఆర్**



**హైదరాబాద్,ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ కబంద హస్తాల్లో చిక్కుకుని రెండేళ్లుగా విలవిలలాడుతున్న తెలంగాణలో మనుషులనే కాదు.. చివరికి పచ్చని చెట్లను కూడా బతకనివ్వడం లేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రతి పల్లెలో పచ్చదనం ఉండాలనే మహోన్నత లక్ష్యంతో కేసీఆర్ నిర్మించిన పల్లె ప్రకృతి వనాలపై కూడా పగబట్టడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. మహబూబ్ నగర్‌లోని దేవరకద్ర మండలం జీనుగురాలలో పల్లె ప్రకృతి వనంలోని 200 చెట్లను కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులే నిర్దాక్షిణ్యంగా నరికివేయడం దారుణమని కేటీఆర్ విమర్శించారు. పదేళ్లపాటు ఆహ్లాద వాతావరణంలో కళకళలాడిన పల్లెలను అన్నిరకాలుగా ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ నిజస్వరూపం రోజుకో రూపంలో బయటపడుతోందని తెలిపారు. ఇప్పటికే చెక్ డ్యామ్‌లను పేల్చివేస్తున్నారని.. చెరువులను చెరబట్టారని.. వ్యవసాయాన్ని కుప్పకూల్చారని.. కులవృత్తులను కాలరాశారని పేర్కొన్నారు. ఇప్పుడు నీడనిచ్చే చెట్లను కూడా అడ్డంగా

మిగతా2లో...

## గతం కన్నా ధృడంగా అమెరికా ఆర్థిక వృద్ధి

- దేశాన్ని మరింత ధృడంగా నిర్మించడమే లక్ష్యం
- సాదాసీదా స్థాయి నుంచి సుదృఢ అమెరికాను నిర్మించా
- పౌరుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం
- ఇరాన్ అణు కార్యాక్రమాలతో అప్రమత్తంగా ఉన్నాం
- తన పాలనా ప్రయాణం యుగాలకు మలుపు
- స్టేట్ ఆఫ్ ది యూనియన్ కార్యక్రమంలో ట్రంప్ సుదీరఘ ప్రసంగం



**వాషింగ్టన్,ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** అమెరికా గతంలో కన్నా దృఢంగా, మెరుగ్గా, సుసంపన్నంగా మారిందని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇది అమెరికాకు స్వర్ణయుగం అని ఆయన వెల్లడించారు. మంగళవారం స్టేట్ ఆఫ్ ది యూనియన్ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ.. ఇది చారిత్రాత్మక కాలంగా అభివర్ణించారు. తన పరిపాలన ప్రయాణం.. యుగాలకు మలుపుగా ఉంటుందని తెలిపారు. దేశ ఆర్థికాభి వృద్ధి పరుగులు పెడుతుందన్నారు. భవిష్యత్తులో దేశాన్ని మరింత మెరుగు పరుస్తామని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే జాతీయ పునరుజ్జీవం, ఆర్థిక వృద్ధితోపాటు ప్రపంచ ప్రభావంపై దృష్టి సారించినట్లు డొనాల్డ్ ట్రంప్ వివరించారు. ప్రపంచ స్థాయిలో అమెరికా మెరుగుపడిందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల వరకు అమెరికా సాదాసీదాగా ఉండేదని.. కానీ ప్రస్తుతం ప్రపంచంలోనే అగ్ర భాగాన నిలిచిందని ధీమా వ్యక్తం చేశారు. ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం.. ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్‌ను పురుషుల హాకీ ఒలింపిక్స్ విజేత కానర్ హెల్లెబ్యూక్‌కు ప్రదానం చేయనున్నట్లు

మిగతా2లో...

## మీడియా అకాడమీ చైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి పదవీకాలం పొడిగింపు






## సిఎం రేవంత్‌తో అడోబ్ సిఇవో శంతన్ భేటీ

**హైదరాబాద్,ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని అడోబ్ సీఈవో శంతను నారాయణ్ కలిశారు. హైదరాబాద్‌లో సీఎంతో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణ రైజింగ్ బోర్డు సభ్యుడిగానూ శంతను కొనసాగుతున్న నేపథ్యంలో గ్లోబల్ ట్రెండ్స్, కొత్త అవకాశాలతో రేవంత్‌తో చర్చించారు. ఉద్యోగాలపై ఏఐ ప్రభావం, గ్రీన్ ఎనర్జీ, ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చ జరిగింది.

## స్పీకర్ కోర్టులో మరో ఇద్దరి భవితవ్యం

- కడియం, దానంలపై తుది విచారణ
- 27,28 తేదీల్లో విచారణకు సిద్ధం



**హైదరాబాద్,ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల వ్యవహారం కీలక దశకు చేరుకొన్నది. ఇప్పటికే 8మంది విషయంలో స్పీకర్ స్పష్టమైన తీర్పును ఇచ్చారు. వీరు పార్టీ మారినట్లుగా ఆధారాలు లేవని స్పీకర్ తీర్పును ఇచ్చారు. ఇప్పుడు మరో ఇద్దరు ఎమ్మెల్యేల వ్యవహారాన్ని తేల్చబోతున్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం దాఖలైన అనర్హత పిటిషన్లపై విచారణ జరిపేందుకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఈ నెల 27, 28 తేదీల్లో పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొం టున్న దానం నాగేందర్, కడియం శ్రీహరి విచారణకు

మిగతా2లో...

# ఆర్థిక మూలాలు పెంచేలా చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

అని అన్నారు. తెలంగాణకు ఆర్థిక మూలాలు పెంచేలా పశుసంవర్ధకశాఖను అభివృద్ధి పరచాలని మంత్రి వాకిటి శ్రీహరి అధికారులకు దిశానిర్ధేశర చేశారు. . కొత్త ఆలోచనలతోనే పశుసంవర్ధక శాఖలో మార్పులు తీసుకురాగలమని మంత్రి వాకిటి శ్రీహరి ఆశాభావం వ్యక్తం చేశారు. పాడి పరిశ్రమ పరిపూర్ణంగా ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని వివరించారు. బడ్జెట్‌లో నిధులు ఎన్ని కేటాయించారనేది కాకుండా ఎంతమేరకు ఖర్చు చేశామనే ఆలోచన చేసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. బ్జడెట్ లో అధిక నిధులు కేటాయించేలా నివేదికలు తయారు చేయాలని అధికారులను మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వ పథకాలను రూపొందించాలని మంత్రి సూచించారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి హర్యానా, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల మోడల్‌ను ఆదర్శంగా తీసుకొని రాష్ట్రంలో పథకాలను డిజైన్ చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. పశుసంవర్ధక, పాడి పరిశ్రమలో ఏం చేస్తే సక్సెస్ అవుతామో అధ్యయనం చేయాల్సిన అవసరముందన్నారు. ఆరోగ్యకరమైన తెలంగాణను నిర్మిస్తేనే భవిష్యత్ బాగుంటుందని మంత్రి వాకిటి శ్రీహరి అభిప్రాయపడ్డారు. అందుకోసం స్వచ్ఛమైన పాలు, బలమైన పోషకాలు ఉన్న చికెన్, మటన్, చేపల ఉత్పత్తి రాష్ట్రంలో జరుగాలని మంత్రి శ్రీహరి అన్నారు.

ఉన్నతాధికారులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ బాధ్యతతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని మంత్రి వాకిటి స్పష్టం చేశారు.పాడి రంగానికి సంబంధించి అన్ని అంశాలు బ్జడెట్‌లో పొందుపరచాలని, పాల ఉత్పత్తి, అందుకావాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి శ్రీహరి అన్నారు. పాడి పరిశ్రమ బలోపేతం, సమన్వయం కోసం ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించుకోవాలని, దానివల్ల పాల ఉత్పత్తిని పెంచుకోవొచ్చని మంత్రి వాకిటి శ్రీహరి ఆశాభావం వ్యక్తం చేశారు. వెటర్నరీ సంస్థల్లో మౌలిక సదుపాయాలు, ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాలకు కూడా బ్జడెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం పశువులకు టీకాలు, ఔషధాల సరఫరా జరిగేలా, దానికి బ్జడెట్‌లో కేటాయింపులు ఉండాలని అధికారులకు మంత్రి వివరించారు. గతంలో లాగా కాకుండా పశుసంవర్ధక శాఖను బలోపేతం చేయాలని మంత్రి అధికారులకు వివరించారు. ఈసమీక్ష సమావేశంలో రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్య శాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్ ఈంఅ, డైరెక్టర్ గోపీ, డెయిరీ డెవలంప్‌మెంట్ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, పివి నర్సింహ రావు వెటర్నరీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా.జ్ఞాన ప్రకాశ్, ఉన్నతాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సొంత భవనాల్లో రెవెన్యూ కార్యాలయాలు

**తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల నిర్మాణం**

**అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్,ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శక పరిపాలన అందించాలనే లక్ష్యంతో తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సచివాలయంలోని తన కార్యాలయంలో బుధవారం రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి పొంగులేటి అ÷-దదె భవనాల్లో కొనసాగుతున్న తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల గురించి ఆరా తీశారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను



ఆధునికీకరించి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. మొదటి దశలో.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. రెండో విడతలో.. శిథిలావస్థలో ఉన్న 170 ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలను నిర్మిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండేట్లు డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని వివరించారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందని పేర్కొన్నారు.

# గతం కన్నా ధృడంగా అమెరికా ఆర్థిక వృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గత తొమ్మిది మాసాల్లో అమెరికాలోకి ప్రవేశించిన అక్రమ వలసదారులు శాతం సున్నాకు చేరిందని పేర్కొన్నారు. 2028లో ఒలింపిక్స్‌కు అమెరికా వేదిక కానుందని ప్రకటించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వాన్ని నిర్మిస్తున్నామని ప్రజలకు భరోసా ఇచ్చారు. పౌరుల సంక్షేమానికే తమ తొలి ప్రాధాన్యమన్నారు. బిగ్ బ్యూటిఫుల్ బిల్‌తో అమెరికన్లకు ఉపశమనం కలిగిందన్నారు. అలాగే సరిహద్దు భద్రత, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పూర్తిగా నిరోధించామని ట్రంప్ చెప్పారు. దేశంలోని ఆర్థిక అంశాల ను సైతం ఈ సందర్భంగా ట్రంప్ ప్రస్తావించారు. గ్యాస్ ధరలు తగ్గించామని.. ఆ తర్వాత అంటే.. మూడు నెలల్లో యూఎస్ ఆర్థిక వ్యవస్థ పుంజుకుందన్నారు. తమ కొత్త స్నేహితుడు, భాగస్వామి అయిన వెనిజులా నుంచి 80మిలియన్ బ్యారెళ్ల చమురును తీసుకున్నామని ఆయన వివరించారు. ఇదంతా ఆ దేశ నాయకుడు నికోలస్ మదురోను పదవీచ్యుతుడిని చేసిన నాటినుంచి నేటివరకు ఇది చోటు చేసుకుందన్నారు. దాంతో అమెరికా చమురు ఉత్పత్తి రోజుకు 60 వేల బ్యారెళ్ల మేర పెరిగిందని సోదాహరణగా విపులీకరించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో చేసిన ప్రతిజ్ఞ.. డ్రిల్, బేబీ, డ్రిల్‌ను ట్రంప్ ఉటంకించారు. వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ హిల్‌లో ఉభయసభలను ఉద్దేశించి ఆయన అతి సుదీర్ఘ ప్రసంగం చేశారు. సుమారు గంటా 50 నిమిషాల పాటు ట్రంప్ మాట్లాడారు. తన ప్రసంగాల్లో ఇదే అతిసుదీర్ఘమైందిగా రికార్డుకెక్కింది. 2000 సంవత్సరంలో అప్పటి అధ్యక్షుడు బిల్ క్లింటన్ అత్యధికంగా 90 నిమిషాల పాటు మాట్లాడారు. ఇప్పుడు ఆ రికార్డును ట్రంప్ బ్రేక్ చేశారు. గత ఏడాది మార్చిలో కూడా ట్రంప్ సుమారు 100 నిమిషాల పాటు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన విషయం తెలిసిందే. ట్రంప్ తన ప్రసంగంలో ఎక్కువగా ఆర్థిక ఎజెండా గురించి ప్రస్తావించారు. ఇక ఇరాన్ అంశంలో వార్నింగ్ ఇచ్చారు. వాస్తవానికి ఆ సమస్యను దౌత్యం ద్వారా పరిష్కరించేందుకు ఇష్టపడుతున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. కానీ అణ్వాయుధాలను సమీకరిస్తున్న ఇరాన్ వైఖరిని మాత్రం ట్రంప్ ఖండించారు. న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్‌ను ఇరాన్ విరమించుకోవాలన్నారు. అమెరికాను తాకే క్షిపణులను ఇరాన్ డెవలప్ చేస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. కానీ దీనిపై ఆయన తన ప్రసంగంలో ఎటువంటి ఆధారాలను బయటపెట్టలేదు. యురోప్‌కు ప్రమాదంగా మారే కొన్ని మిస్సైల్స్‌ను ఇప్పటికే ఇరాన్ డెవలప్ చేసిందన్నారు. ఇతర దేశాల్లో ఉన్న అమెరికా బేస్‌లను కూడా టా÷-గ్గ÷ట్ చేసే రేంజ్ ఇరాన్‌కు ఉందన్నారు. ఇక అమెరికా భూభాగానికి చేరుకునే స్థాయికి తగ్గ క్షిపణులను కూడా ఇరాన్ అభివృద్ధి చేస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. మిడిల్ ఈస్ట్‌పై ట్రంప్ ఎక్కువగా ఫోకస్ చేయడం వల్ల.. ఇరాన్‌తో యుద్ధానికి ఆ దేశం సిద్ధం అవుతుందేమో అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే తాము ఇచ్చిన డిమాండ్లను ఒకవేళ ఇరాన్ అంగీకరించకపోతే, అప్పుడు ట్రంప్ అనుకున్నంత పనిచేసే అవకాశాలు ఉన్నాయి. గత ఏడాది ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలపై దాడి చేశామని, ఆ దాడి వల్ల ఆ దేశ న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్ స్తంభించినట్లు ట్రంప్ చెప్పారు. న్యూక్లియర్ వెపన్ అంశంలో ఇరాన్ ఇంకా ఎటువంటి హామీ ఇవ్వలేదన్నారు. అణ్వాయుధాలను తయారు చేయమన్న వ్యాఖ్యలు ఇంకా ఇరాన్ నుంచి రావడం లేదన్నారు.



# హైకోర్టులో ఐపిఎస్ అధికారి నాయక్ ముందస్తు బెయిల్

**అమరావతి,ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఏపీ హైకోర్టులో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ బుధవారం ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు కస్టోడియల్ టార్చర్ కేసులో గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో సునీల్ నాయక్‌పై కేసు నమోదైన విషయం తెలిసిందే. రఘురామ అరెస్ట్ సమయంలో ఏపీ సీఐడీ ఎస్పీగా ఆయన ఉన్నారు. రెండు రోజుల క్రితం సునీల్ నాయక్‌ను అరెస్ట్ చేసేందుకు ఎస్పీ దామోదర్ బిహార్ వెళ్లారు. ఈ క్రమంలోనే ట్రాన్సిట్ వారెంట్ ఇచ్చేందుకు నిరాకరించింది బిహార్ కోర్టు. దీంతో ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు సునీల్ నాయక్. ముందస్తు బెయిల్ పిటిషన్ రేపు(గురువారం) విచారణకు వచ్చే అవకాశం ఉంది.

# తెలంగాణలో ఇంటర్ పరీక్షలు ప్రారంభం

**• క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపిన అధికారులు**

**హైదరాబాద్,ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు



బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. విద్యార్థులు వారికి కేటాయించిన పరీక్షా కేంద్రాలకు ఉదయాన్నే చేరుకున్నారు. దీంతో ఎక్కడ చూసినా సందడి వాతావరణం నెలకొంది. పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులను ఆయా కళాశాలల సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం 9 గంటలకు ఫస్టియర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. గురువారం నుంచి సెండియర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్ పరీక్షల కోసం రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 1495 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 9.97 లక్షల మంది పరీక్షలకు హాజరవుతున్నారు. ఇంటర్ పరీక్షలకు హాల్ టికెట్ ఉంటేనే అనుమతిస్తున్నారు. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లను పరీక్షకు అనుమతిస్తారు. హాల్‌టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా ఎంట్రీ ఉంటుంది. ఒక్క హాల్‌టికెట్ వెంట ఉంటే సరిపోతుంది. ఎలాంటి గుర్తింపు పత్రాలు అవసరంలేదు. ఈజాగా సమాధాన పత్రాల మూల్యాంకనం షెడ్యూల్‌ను ఇంటర్‌బోర్డు ప్రకటించింది. మార్చి 4 నుంచి సంస్కృతం పేపర్ల మూల్యాంకనం ప్రారంభమవుతుంది. మార్చి 15నుంచి మొదటి విడత, మార్చి 18నుంచి రెండో విడత, మార్చి 20 నుంచి మూడో విడత మూల్యాంకనం ప్రారంభమవుతుంది. ఏప్రిల్ రెండో వారంలో ఫలితాలు విడుదల చేస్తారు.

# వేంపల్లె నందీశ్వరాలయంలో విగ్రహ ప్రతిష్ట

(మొదటి పేజీ తరువాయి)

వైఎస్ జగన్ సందర్శించారు. నందీశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమంలో జగన్ పాల్గొన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆలయానికి రూ. 1.8 కోట్లు మంజూరు చేశారు. మొత్తం ఆరు కోట్ల రూపాయలతో దేవాలయ నిర్మాణం జరిగింది. ఈ కార్యక్రమం తర్వాత.. వైఎస్ జగన్ మధ్యాహ్నం నుంచి క్యాంపు కార్యాలయంలో ప్రజదర్బార్ నిర్వహించనున్నారు. అయితే దీనికి ముందుగా పులివెందుల నివాసం నుంచి బయలుదేరిన వైఎస్ జగన్? వైఎస్ రాజారెడ్డి సోదరిని పరామర్శించి, యోగక్షేమాలు తెలుసుకున్నారు.

# యూత్ కాంగ్రెస్ నేతల అరెస్ట్ సిగ్గుచేటు

(మొదటి పేజీ తరువాయి)

మనం గర్వించదగిన వారసత్వం. ఇది మహాత్మాగాంధీ, లక్షలాది మంది భారతీయుల పూర్వీకుల నుండి వారసత్వంగా వచ్చింది. ప్రపంచ ఒత్తిడికి తలొగ్గి భారతదేశ ప్రయోజనాలతో రాజీపడిన ప్రధానికి, ఆయన ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వరం పెంచడం 1.4 బిలియన్ల భారతీయుల ప్రయోజనాలకు మంచిది. ప్రజల గొంతును పెంచినందుకు యూత్ కాంగ్రెస్ సభ్యులపై తీసుకున్న చర్య తీవ్రంగా ఖండించదగినది. సిగ్గుచేటైన విషయం. కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ యొక్క నిర్భయ సైనికులకు దృఢంగా అండగా నిలుస్తుంది ’ అని ఆమె బుధవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు పేర్కొన్నారు. చేశారు. అని ప్రియాంక ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఈగా, ఎఐ సదస్సులో షర్ట్ విప్పి నిరసన తెలిపిన ఘటనకు కీలక సూత్రధారిగా భావించిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉదరు భాను చిబ్‌ను మంగళవారం అరెస్టు చేశారు. ఉదరు భానుతోపాటు మరో ఆరుగురు కాంగ్రెస్ కార్యకర్తల్ని అరెస్టు చేసి.. వారిపై అల్లర్లకు పాల్పడినట్లు పోలీసులు అభియోగాలు మోపారు.

# ఉగ్రవాదంపై పోరులో ఇజ్రాయెల్‌కు పూర్తి అండ

(మొదటి పేజీ తరువాయి)

తొలి భారత ప్రధాని తానేనని మోదీ అన్నారు. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రసంగం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'భారత్, ఇజ్రాయెల్.. ప్రాచీన నాగరికత కలిగిన దేశాలు. ఇజ్రాయెల్‌తో 140 కోట్ల భారతీయుల స్నేహం, గౌరవం, భాగస్వామ్యం ఉంది. ఉగ్రవాదంపై పోరులో ఇజ్రాయెల్‌కు పూర్తి అండగా ఉన్నాం. ఉగ్రవాదంతో దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్నాం. ఉగ్రవాదానికి భారత్ పూర్తి వ్యతిరేకం. శాంతిస్థాపన అనేది అంత సులువైన విషయం కాదు. ఉనికి కోసం యూదులు అనేక కష్టాలు పడ్డారు'.ఇజ్రాయెల్‌ను గుర్తించిన 1950 లోనే నేనూ జన్మించా. ఇజ్రాయెల్‌తో భారత్‌కు చరిత్రాత్మక సంబంధాలు ఉన్నాయి. ఇజ్రాయెల్ పౌరులను హమాస్ చంపడం దారుణం. ఇజ్రాయెల్ పౌరుల హత్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ సమర్థించం. పాలస్తీనా సమస్యలపై స్పందించాల్సిన సమయం వచ్చింది. ఉగ్రవాదం విషయంలో ద్వంద్వ వైఖరి వీడాలి. భారత్ ఎప్పుడూ చర్చలు, శాంతినే కోరుకుంటుంది' అని అన్నారు. ఇజ్రాయెల్ పర్యటనలో ఉన్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆ దేశ పార్లమెంటులో ఘనస్వాగతం లభించింది. ఇజ్రాయెల్ పార్లమెంటు 'నెస్సెట్'ను ఉద్దేశించి మోదీ బుధవారంనాడు ప్రసంగించారు. పార్లమెంటు హాలులోకి మోదీ ప్రవేశించగానే సభ్యులంతా లేచి నిలబడి కరతాళ ధ్వనులతో మోదీకి స్వాగతం పలికారు. 'మోదీ... మోదీ' నినాదాలు హోరెత్తించారు. సాధారణంగా అమెరికా అధ్యక్షుడు వంటి అత్యంత కీలక మిత్రదేశాల అధినేతలకు మత్రమే దక్కే ఈ అరుదైన గౌరవం భారత ప్రధానికి దక్కడం విశేషం. నెస్సెట్ స్పీకర్ అమిర్ ఒహానా మాట్లాడుతూ, నెస్సెట్ స్పీకర్‌గా సభలో ప్రసంగించనున్న తొలి ప్రధానిని ఆహ్వానించే అవకాశం దొరకడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. 'థాంక్యూ ప్రైమ్ మినిస్టర్ మోదీ' అంటూ హర్షాతిరేకం వ్యక్తం చేశారు.

# న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే సహించబోం..

(మొదటి పేజీ తరువాయి)

న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. 'కొన్ని రోజులు ఆగండి. దీనిపై నేను సుమోటోగా విచారణ చేపడతాను' అని తెలిపారు. న్యాయవ్యవస్థలో అవినీతి గురించి 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌సీఈఆర్‌టీ బోధిస్తోందని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సహా రాజకీయ నేతలు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతుంటే ప్రభుత్వాలు ఎందుకు దాచిపెడుతున్నాయని ప్రశ్నించారు. ఎంపిక చేసి మరీ న్యాయవ్యవస్థనే నిలదీస్తున్నట్టు కనిపిస్తోందని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి సైతం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్‌సీఈఆర్‌టీ ఇటీవల న్యాయవ్యవస్థ అనే అధ్యాయాన్ని విస్తరించింది. న్యాయవ్యవస్థలో ఉన్న అవినీతి అంశాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టింది. విద్యార్థులు కేవలం సిద్ధాంత పరమైన అవగాహనకే పరిమితం కారాదని, వ్యవస్థలోని సవాళ్లు, లోపాలు, వాస్తవ పరిస్థితుల గురించి కూడా తెలుసుకోవాలనే లక్ష్యంతో ఈ మార్పులు చేసినట్టు చెబుతోంది. లక్షలాది కేసులు, విచారణలో జరుగుతున్న జాప్యం వంటి అంశాలను పాఠ్యాంశంలో ప్రస్తావించింది. అయితే పాఠ్యాంశంలో తాజా మార్పుల వల్ల చిన్నారులలో న్యాయవ్యవస్థపై ప్రతికూల భావన పెరగవచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# స్పీకర్ కోర్టులో మరో ఇద్దరి భవితవ్యం

(మొదటి పేజీ తరువాయి)

తమ వాదనలను వినిపిం చడంతోపాటు సాక్ష్యాధారాలను సమర్పించాల్సి ఉంటుందని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. స్పీకర్ నేతృత్వంలోని ట్రిబ్యునల్ ఎదుట పిటిషనర్ల తరఫు న్యాయవాదులు అడిగే ప్రశ్నలకు దానం, కడియం సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరలేదని నిరూపించుకోవడానికి అవసరమైన ఆధారాలను సమర్పించాల్సి ఉంటుంది. గత నెల 18న ఈ కేసులో పిటిషనర్ పాడి కౌశిక్‌రెడ్డిని దానం నాగేందర్ తరఫు న్యాయవాదులు ప్రశ్నించారు. 19న కడియం తరఫు లాయర్లు వివేకానందగౌడ్‌ను ప్రశ్నించారు. స్పీకర్ జారీచేసిన విచారణ షెడ్యూల్ ప్రకారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నెల 27వ తేదీన ఉదయం 11:00 గంటలకు విచారణ ఉంటుంది. బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యాహ్నం 12:00 గంటలకు విచారణ చేపడుతారు. 28వ తేదీన ఉదయం 11:00 గంటలకు బీఆర్ఎస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఉంటుంది. ప్రతివాది స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తరఫున సాక్ష్యాధారాలను సేకరిస్తారు

# జీనుగురాలలో పల్లె ప్రకృతి వనంలో 200 చెట్ల నరికివేత

(మొదటి పేజీ తరువాయి)

నరికేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ఈ దుశ్చర్యకు పాల్పడిన ప్రతి ఒక్కరిపై కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ‘పల్లె కన్నీరు పెడుతుందో‘ అని మరోసారి పాడుకునే దుస్థితి తెచ్చిన కాంగ్రెస్ పార్టీపై తెలంగాణలోని ప్రతి గ్రామం తిరగబడే రోజు దగ్గర్లోనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

# మీడియా అకాడమీ చైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి పదవీకాలం పొడిగింపు

**హైదరాబాద్,ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా కె. శ్రీనివాసరెడ్డి పదవీకాలం మరో రెండేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ 24తో ఆయన పదవీకాలం ముగిసింది. దీంతో కొత్తవారిని నియమిస్తారని అంతా అనుకున్నారు. కానీ ప్రభుత్వం తిరిగి శ్రీనివాసరెడ్డికే అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలో మరో రెండేళ్లపాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు. తన పదవీకాలం పొడిగించినందుకు ఆయన సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

# ములుగు మున్సిపాలిటీ పరిధిలోని నాలుగు వార్డులలో మంచినీటి సరఫరా కోసం బోర్లు వేయించిన మంత్రి సీతక్క

**ములుగు మున్సిపాలిటీ, ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు ఇటీవలే జరిగిన ములుగు మున్సిపాలిటీ ఎన్నికల్లో బండారుపల్లి గ్రామంలో నీటి సమస్య ఉన్న వార్డులకు 6బోర్లు వేపిస్తామని రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీమతి దనసరి అనసూయ సీతక్క గారు హామీ ఇవ్వడం జరిగింది. ఇచ్చిన హామీ ప్రకారం ఎన్నికలు జరిగిన 15 రోజుల్లోనే బోర్లు వేపిస్తున్న రాష్ట్ర మంత్రి సీతక్క గారికి గ్రామస్థులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ గారు బోరు పాయింట్ వద్ద కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. మంత్రి సీతక్క గారు బండారుపల్లి గ్రామంలో అభివృద్ధి పనులు చేయడానికి



ప్రత్యేక దృష్టి పెట్టారని గ్రామంలోని 4 వార్డుల్లో ఇచ్చిన హామీ ప్రకారం పని చేస్తారని ఇప్పటికే 4కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నామని సెంటర్ లైటింగ్ తో పాటు పలు అభివృద్ధి పనులు చేస్తున్నామని రానున్న రోజుల్లో బండారుపల్లి గ్రామంలో మరింత అభివృద్ధి జరుగుతుందని ఈ సందర్భంగా ములుగు జిల్లా గ్రంధాలయ చైర్మన్ బానోత్ రవిచందర్ గారు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు నెల్లుట్ల రాజన్న,10వ వార్డు కౌన్సిలర్ గజ్జెల సుస్మిత,11వ వార్డు కౌన్సిలర్ కేశెట్టి నవీన్,13వ వార్డు కౌన్సిలర్ సిలువేరు సాంబయ్య,మాజీ సర్పంచ్ కెక్కర్ల అశోక్ గౌడ్,యూత్ నాయకులు గూడెపు రాకేష్ సీనియర్ నాయకులు నాగిరెడ్డి,సముద్రాల రమేష్, నెల్లుట్ల రమేష్, గుడెపు స్వామి, అలువాల రాజు కుమార్ ,దొంగరి రవి, పోషాలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# డయల్ యువర్ డిపో మేనేజర్



**పరకాల, ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజా రవాణా సేవలను మరింత మెరుగుపర్చే దిశగా పరకాల డిపో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 26-02-2026న మధ్యాహ్నం 11 గంటల నుండి 12 గంటల వరకు "డయల్ యువర్ డిపో మేనేజర్" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ రాంప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు.డిపో పరిధిలోని వివిధ మండలాల ప్రజలు, వ్యాపారస్తులు, ఉద్యోగులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆర్టీసీ సేవల అభివృద్ధి, బస్సుల సమయపాలన, కొత్త రూట్ల అవసరం, ప్రయాణికుల సౌకర్యాలు తదితర అంశాలపై తమ అమూల్యమైన సూచనలు, సలహాలను నేరుగా డిపో మేనేజర్‌కు తెలియజేసే అవకాశం కల్పించబడింది.కార్యక్రమంలో భాగంగా 9959226051 నంబర్‌కు ఫోన్ చేసి తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఆర్టీసీ సేవలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దగలమని పేర్కొన్నారు.కావున ప్రజలు, వ్యాపార వర్గాలు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఆర్టీసీ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని డిపో అధికారులు విజ్ఞప్తి చేశారు.

# సాగునీరు లేక రైతుల వలసలు దేవదుల నీటితో మైదానాలకు సంబరాలా?

### ఏజెన్సీ రైతులకు అన్యాయం బీజేపీ కిసాన్ మోర్చా నేత డా. జాడి రామరాజు తీవ్ర విమర్శలు

**ఏటూరునాగారం,ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఏజెన్సీ ప్రాంతంలో సాగునీరు లేక 55 వేల మంది రైతులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారని, సుమారు 1.10 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి బీడుగా మారి, చిన్న, సన్నకారు రైతులు వలస బాట పట్టే పరిస్థితి నెలకొందని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా. జాడి రామరాజు నేత ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం ఏటూరునాగారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏటూరునాగారం, మంగపేట, తడ్వాయి, కన్నాయిగూ డెం, వాజేడు, వెంకటాపురం మండలాల్లో రైతులు సాగునీరు లేక ఇబ్బందులు పడుతుంటే, దేవదుల లిఫ్ట్ ఇరిగేషన్ పథకం నీటిని మైదాన ప్రాంతాలైన ధర్మసాగర్, స్టేషన్ ఘనపూర్, జనగామ, నల్గొండ జిల్లాలకు తరలిస్తూ సుమారు 3.88 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారని ఆరోపించారు.ఇలాంటి పరిస్థితుల్లో ఏజెన్సీ ప్రాంత కాంగ్రెస్ నాయకులు, మంత్రి పాలాభిషేకాలు, సంబరాల్లో మునిగిపోయారని, ఇది రైతుల కష్టాల పట్ల నిర్లక్ష్యానికి పరాకాష్ఠ అని విమర్శించారు. తమ ప్రాంతాన్ని ఎడారిగా మార్చుతూ మైదాన ప్రాంతాలకు నీళ్లు తరలిస్తుంటే, దీనికి వ్యతిరేకంగా నిలవాల్సిన నాయకులు మంత్రి జెండాలు మోయడానికి సిద్ధంగా ఉండటం బాధాకరమని అన్నారు.అదేవిధంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, బీఆర్ఎస్ ముసుగులో మంత్రికి గూఢచారిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించా రు. కాంగ్రెస్ బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మితే ఏజెన్సీ ప్రాంతం పూర్తిగా ఎడారిగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ములుగు ఎమ్మెల్యే, తెలంగాణ గ్రామీణ నీటి పారుదల శాఖ మంత్రి స్థానిక మండల మైన ములుగు మల్లంపల్లికి దేవదుల లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి నీరు తరలించేందుకు రూ.150 కోట్లతో పనులు చేస్తున్నామని చెబుతున్నారని, కానీ ఏజెన్సీ ప్రాంత రైతులకు సాగునీరు, త్రాగునీరు లేకపోవడంపై ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని విమర్శించారు. ఇటువంటి నాయకులు ఈ ప్రాంతానికి అవసరమా అని ప్రశ్నించారు.మేడారం జాతర నిధుల పేరుతో దేవదుల లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద ముఖ్యమంత్రి పిలిచారని చెబుతున్నా, అసలు రూ.143 కోట్ల నిధుల వివరాలను స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలని, లేదంటే కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పొగడటానికే ఈ వ్యాఖ్యలని ఆరోపించారు.గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కన్నాయిగూడెం, ఏటూరునాగారం, మంగపేట, తడ్వాయి మండలాలకు సాగునీరు, త్రాగునీరు లేక రైతులు వలసలు వెళ్తున్నారని చెప్పిన నాటి ఎమ్మెల్యే, నేటి మంత్రి ఏజెన్సీ రైతుల కోసం ఏం చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండి, కాంగ్రెస్ బీఆర్ఎస్ నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా. జాడి రామరాజు నేత పిలుపునిచ్చారు.



# కుల విద్వేషాల బలికి పసిబిడ్డ ప్రాణం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ప్రజా సంక్షేమ వేదిక డిమాండ్






**పరకాల, ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** నాగర్ కర్నూలు జిల్లాలోని కుమ్మెర గట్టు మల్లన్న జాతరలో చోటుచేసుకున్న కుల గొడవల్లో అభం శుభం తెలియని పసిబిడ్డ మృతి చెందడం తీవ్ర విషాదకరమని ప్రజా సంక్షేమ వేదిక అధ్యక్షుడు మడికొండ రఘుపతి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఏర్పాటు చేసిన సంస్థ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చిన్నారి ప్రాణానికి కారణమైన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సమాజంలో ఇంకా తక్కువ కులంఎక్కువ కులం అనే భావజాలం కొనసాగుతుండటం దురదృష్టకరమని రఘుపతి అన్నారు. కులం పేరుతో ఎదుటివారిని హేళనగా చూడటం, అంటరానితనం ప్రదర్శించడం అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. దేవాలయాలు, విద్యాలయాలు, ప్రజా ప్రదేశాలు అన్నీ సమానత్వానికి ప్రతీకలుగా మారాలని, కుల వివక్షకు అక్కడ చోటు ఉండకూడదని స్పష్టం చేశారు.ప్రతి వ్యక్తి సోదరభావంతో జీవించే సమాజ నిర్మాణం కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కుల వ్యవస్థతో పాటు లింగ వివక్ష నిర్మూలనకు సమిష్టిగా ముందుకు రావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకులు జున్ను జయపుచ్చ సమ్మయ్య, శనిగరపు శ్రీనివాస్, మునగాల అశోక్, ఏకు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇళ్ల కూల్చివేత దారుణం

**బాధితులకు బీజేపీ అండగా ఉంటుంది.**

**బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు**

**ఖమ్మం, ప్రతినిధి ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** పేదల సంక్షేమమే ధ్యేయమని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వ అసలు స్వరూపం ఖమ్మం నగరంలో బయటపడిందని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. ఖమ్మం అంబేద్కర్ భవనంలో తలదాచుకుంటున్న భూదాన్ నిర్వాసితులను భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు కలసి పరామర్శించారు. వారి దీనస్థితిని చూసి చలించిపోయిన నాయకులు , బాధితుల బాధలను అడిగి తెలుసుకున్నారు. నిరుపేదలను ఇలా అర్థాంతరంగా గెంటివేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ కష్టకాలంలో భారతీయ జనతా పార్టీ వారికి పూర్తి అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని ఆయన బాధితులకు కొండంత భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడు లేని నిరుపేదలు గత 14



సంవత్సరాలుగా భూదాన్ కాలనీలో నివాసం ఉంటున్న ఇళ్లను, వారికి ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా రాత్రికి రాత్రే అధికారులు నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడం దారుణమైన విషయం అన్నారు. కారుణ్యం లేకుండా చేసిన ఈ అమానుష చర్యతో పసిపిల్లలు, వృద్ధులతో సహా వందలాది మంది అభాగ్యులు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పద్నాలుగేళ్లుగా ఒకే చోట స్థిరపడి, రోజువారీ కూలి చేసుకుంటూ బతుకుతున్న వారిని కనీస మానవత్వం లేకుండా ఎలా గెంటివేస్తారని ఆయన ప్రశ్నించారు. పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాల్సిన ప్రభుత్వమే, ఉన్న ఆ కాస్త గూడును లాక్కోవడం దారుణమన్నారు. ఆక్రమణల పేరుతో ఇళ్లు కూల్చేముందు వారికి కనీస పునరావాసం కల్పించాలన్న సోయి అధికారులకు లేకపోవడం సిగ్గుచేటన్నారు. నిరాశ్రయులైన కుటుంబాలకు తక్షణమే ఆహారం, మందులు వంటి కనీస సదుపాయాలు కల్పించడంతో పాటు, ఏమాత్రం జాప్యం చేయకుండా అసలైన నిరుపేదలకు పక్కా గృహాలు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇళ్ల కేటాయింపుల్లో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా, వాస్తవంగా ఇళ్లు కోల్పోయిన అసలైన పేదలందరికీ వంద శాతం న్యాయం జరిగేలా పారదర్శకంగా వ్యవహరించాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నున్నా రవికుమార్, గుత్తా వెంకటేశ్వర్లు, నాయుడు రాఘవరావు, వీరవల్లి రాజేష్, వీరంరాజు, విజయరాజు, గడిల నరేష్ , వాకదాని రామకృష్ణ , శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చెత్త తరలింపు వాహనాలు సమయానికి ట్రాన్స్ఫర్ స్టేషన్‌కు చేరుకోవాలి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- బాలసముద్రంలోని ట్రాన్స్ఫర్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ



**హన్మకొండ, ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** చెత్త తరలింపు వాహనాలు నిర్దేశిత సమయానికి ట్రాన్స్ఫర్ స్టేషన్ కు చేరుకోవాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులకు సూచించారు. బుధవారం హన్మకొండలోని బాల సముద్రంలో బల్దియా నిర్వహిస్తున్న ట్రాన్స్ఫర్ స్టేషన్ లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి వాహన మరమత్తుల తీరుతో పాటు తడి పొడి చెత్త సేకరణ విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వెహికల్ షెడ్ కు చేరే స్వచ్ఛ ఆటోలు వాహనాలు తడి పొడి చెత్తను వేరుగా తీసుకు వస్తున్నాయా? అని అడిగి తెలుసుకొని ఎన్ని వాహనాలు మరమ్మత్తులు చేపట్టుటకు షెడ్ లో ఉన్నాయన్న కమిషనర్ కాంపాక్టర్ ల స్థితిగతులను ఈఈ ను అడిగి తెలుసుకున్నారు. తడి పొడి చెత్త ను వేరుగా సేకరించాలని ఆయా చెత్త సేకరణ వాహనాలు ఏ ప్రాంతాల్లో సేకరణ జరుపుతున్నాయని, ఏ సమయానికి ట్రాన్స్ఫర్ స్టేషన్ కు చేరుతున్నాయని, చెత్త తరలింపు ట్రాక్టర్లు జే సి బి ల తో పాటు వివిధ శానిటేషన్ వాహనాల కదలికల గురించి ఏం హెచ్ ఓ ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సి ఎం హెచ్ ఓ డా.రాజేష్, ఈ ఈ లు మాధవి లత, మహేందర్, డి ఈ రాజ్ కుమార్, సానిటరీ సూపర్ వైజర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈఎస్ఐ ఆసుపత్రిని తనిఖీ చేసిన యంపి కడియం కావ్య, జిల్లా కలెక్టర్ సత్య శారద






**హన్మకొండ, ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆసుపత్రిలోని అవుట్ పేషెంట్ విభాగం, ఇన్‌పేషెంట్ వార్డులు, మందుల సరఫరా, వైద్య సేవల పరిస్థితిని ఎంపీ స్వయంగా పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న చికిత్సపై వివరాలు తెలుసుకున్నారు.వరంగల్ జిల్లాకు త్వరలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, మెగా టెక్స్టైల్ పార్క్, విమానాశ్రయం వంటి మూడు ప్రధాన ప్రాజెక్టులు రానున్న నేపథ్యంలో కార్మికుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు. ఈ కారణంగా చికిత్స కోసం ఈఎస్ఐ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య మరింత పెరుగుతుందని పేర్కొంటూ, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రి సౌకర్యాలను ఇప్పటినుంచే బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే ఈఎస్ఐ ఆసుపత్రిని తనిఖీ చేసినట్లు ఎంపీ వెల్లడించారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు, నర్సులు, సిబ్బందితో ఎంపీ, కలెక్టర్ లు సమావేశమై ఆసుపత్రి నిర్వహణ, సౌకర్యాల లోటుపాట్లు, సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. వైద్యుల ఖాళీల భర్తీ, మందుల కొరత, శానిటేషన్ పరిస్థితులపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి అవసరమైన నిధులు, వసతులు తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కార దిశగా కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎం హెచ్ ఈడాక్టర్ బి. సాంబశివరావు, ఆసుపత్రి సివిల్ సర్జన్స్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ అశోక్, డాక్టర్ రామచంద్ర, ఆర్ ఎం ఓ డాక్టర్ యుగేందర్ ఇతర వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తాసిల్దార్ కార్యాలయం ఎదుట దళితుల నిరాహార దీక్ష.






**ఏపీ: అన్నమయ్య జిల్లా: పుంగనూరు: ఫిబ్రవరి 25 (పి సి డబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** పుంగనూరు పట్టణంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట దళిత నాయకులు నిరాహారదీక్ష చేపట్టారు. మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ మండలానికి చెందిన మహేష్ అనే వ్యక్తికి గతంలో మంగళం కాలనీ వద్ద ప్రభుత్వం ఐదు సెంట్లు భూమిని మంజూరు చేయడం జరిగిందన్నారు. మహేష్ ఆరోగ్యం క్షీణించి మంచాన పడటంతో ఆ భూమి పై ఎటువంటి నిర్మాణం చేపట్టలేక పోయారన్నారు. నేపథ్యంలో ప్రస్తుతం స్థానికులకు కాకుండా స్థానికేతరులకు పొజిషన్ సర్టిఫికెట్ను తాసిల్దార్ కార్యాలయం వారు మంజూరు చేయడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై గత మూడు రోజుల క్రితం తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టగా మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మార్వో రాము తెలిపారని ఆయన అన్నారు. స్థానికేతరులు మహేష్ కు సంబంధించిన స్థలంలో కట్టడాలు నిర్మిస్తున్న అధికారులు పట్టించుకోకవడంతో వారు నిరాశ చెంది బుధవారం నిరాహార దీక్ష చేపట్టారు. అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టకపోతే జిల్లా కలెక్టర్ వారి దృష్టికి తీసుకెళ్తామని ఆయన అన్నారు. టెంకాయల రాజా, పెంచుపల్లి కృష్ణ, కుమార్ రెడ్డి, గంగ, రాజు, గంగన్న, నాగరాజు, రమణ, రెడ్డప్ప, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

## పుంగనూరు మండలంలో అగ్ని ప్రమాదం. మంటల్లో రూ 1.5 లక్షల ఆస్తి నష్టం



**ఏపీ:అన్నమయ్య జిల్లా: పుంగనూరు: ఫిబ్రవరి 25 (పీసీడబ్ల్యు న్యూస్ ప్రతినిధి):** పుంగనూరు మండలం పట్రపల్లి గ్రామం నందు బుధవారం అగ్నిప్రమాదం సంభవించిందని పుంగనూరు ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపారు. పట్రపల్లి గ్రామానికి చెందిన డి.ఎన్ సతీష్ బాబుకు చెందిన 13 ఎకరాల అల్లనేరేడు తోటలో అగ్ని ప్రమాదం సంభవించిందని రాబడిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి ప్రమాద స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ ప్రమాదంలో డ్రిప్పు పైపులు, మోటార్ కేబుల్, చెట్లు అగ్నికి ఆహుతయాయని ఆయన అన్నారు. అగ్నిప్రమాదంలో దాదాపు 1,50,000 నష్టం ఏర్పడి ఉంటుందని ఆయన అన్నారు. ధూమపానం సేవించి సిగరెట్ ముక్కను ఆర్పకుండా పారవేయడంతో అగ్నిప్రమాదం సంభవించి ఉండవచ్చునని ఆయన అన్నారు. ఎండాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పల్లె ప్రాంతాలలోని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

## సత్తుపల్లి విద్యాలయం విద్యార్థిని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం





**సత్తుపల్లి, ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సత్తుపల్లి విద్యాలయం, శ్రీ చైతన్య కరికులం కు చెందిన విద్యార్థిని చిన్నారి కె. లివిషా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో (ఇంటర్నేషనల్)లో అరుదైన గుర్తింపు సాధించింది.గుడివాడలో నిర్వహించిన అష్టోత్తర నృత్య కీర్తనావైభవం కార్యక్రమంలో భాగంగా 108 మంది విద్యార్థులు 12 గంటల పాటు నిరంతర సాంస్కృతిక ప్రదర్శన అందించారు. ఈ మహత్తర కార్యక్రమంలో కె. లివిషా చురుకుగా పాల్గొని తన ప్రతిభను చాటుకుంది. ఈ విశిష్ట సాధనకు గుర్తింపుగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ నుంచి కె. లివిషాకు సర్టిఫికేట్ ప్రదానం చేయబడింది.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం చిన్నారి లివిషాను మరియు ఆమె తల్లిదండ్రులను చిరు సత్కారం చేసి అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో ఆమె ఇలాంటి మరెన్నో పురస్కారాలను గెలుచుకుని పాఠశాలకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.విద్యార్థిని సాధించిన ఈ ఘన విజయంపై ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## ములుగు జిల్లా కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి





**ములుగు మున్సిపాలిటీ, ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా కేంద్రానికి సమీపంలోని డిగ్రీ కళాశాల సమీపంలో నిర్మిస్తున్న కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అధికారులకు, ప్రజలకు అనుకూలంగా ఉండే విధంగా సుందరంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., గ్రంధాలయ చైర్మన్ బానోతు రవి చందర్, ములుగు మున్సిపల్ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి లతో కలసి నిర్మాణ పనులను పరిశీలించారు. ములుగు మునిసిపల్ చైర్మన్ మాట్లాడుతూ అన్ని నిర్మాణ పనులను నాణ్యత తో పూర్తి చేయాలని, అనుకున్న సమయానికి ముందుగానే అందుబాటులోకి తీసుకురావడానికి సంబంధిత అధికారులు, గుత్తేదారు చోరువ చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆసియా షాహిన్ కౌన్సిలర్లు కౌన్సిలర్లు గుంటోజు పావని నిరంజన్ చారి గుగ్గిళ్ళ దివ్య సుజన్ నల్లెల స్వాతి భరత్ పడాల ఓం ప్రకాష్ కేశెట్టి నవీన్ గజ్జల సుష్మిత యాసం వసంత రవి ఎండి కుతుబుద్దీన్ సిలివేరు సాంబయ్య కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బిజెపి మైనార్టీ మోర్చా నేతల ఆధ్వర్యంలో మేయర్ కోలగని శ్రీనివాస్‌కు ఘన సన్మానం...





**కరీంనగర్,ఫిబ్రవరి25(పీసీడబ్ల్యూ న్యూస్):** బిజెపి మైనార్టీ మోర్చా కరీంనగర్ నేతలు బుధవారం రోజున కరీంనగర్ మేయర్ కొలగని శ్రీనివాస్ ను ఘనంగా సన్మానించారు. ప్ర ప్రథమంగా తెలంగాణ రాష్ట్రంలో కరీంనగర్ బల్దియా ను బిజెపి కైవసం చేసుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని , మేయర్ గా , కోలగని శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ , జిల్లా అధ్యక్షుడు సమీ పర్వేజ్ ఆధ్వర్యంలో బుధవారం రోజున కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ కోలగని శ్రీనివాస్ ను వారంతా మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మైనార్టీ మోర్చా నేతలు పవిత్ర రమజాన్ మాసాన్ని పురస్కరించుకుని కరీంనగర్ నగరంలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని మేయర్ ను కోరారు.ముఖ్యంగా మస్జిద్ పరిసర ప్రాంతాలు మరియు మైనారిటీ వార్డుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎండి సమీ పరవేజ్ రాష్ట్ర నాయకులు ఎండి తాజ్,ఎండి బషీరుద్దీన్, జిల్లా నాయకులు ఎండి సమీ సిద్దిక్ షాదాబ్ , ఎండి అపాన్ తదితరులు పాల్గొన్నారు.

## చదువును మించిన డబ్బు లేదు: పెద్దిటి బుచ్చిరెడ్డి

- నేటి బాలలు రేపటి తరానికి మార్గదర్శకం కావాలి
- సాయి రామ్ కాన్వెంట్ హై స్కూల్‌లో కార్గిల్, సింధూరు ఆటపాటలతో ఆకట్టుకున్న విద్యార్థులు











**ఉప్పల్ ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** చదువుతో ఏదైనా సాధ్యమని, చదువును మించి డబ్బు లేదని పెద్దిటి బుచ్చిరెడ్డి అన్నారు. బుధవారంసాయి రామ్ కాన్వెంట్ హై స్కూల్‌లో చిన్నారుల వార్షికోత్సవ వేడుకలు సందడితో ఘనంగా నిర్వహించారు. చిన్న పిల్లలు రంగురంగుల వేషధారణలతో వేదికపైకి వచ్చి నృత్యాలు, పాటలు, నాటికలతో ప్రేక్షకులను, తల్లిదండ్రులను ఎంతగానో ఆకట్టుకున్నారు.అమాయక నటన, ఉత్సాహభరిత ప్రదర్శనలు తల్లిదండ్రులను ఆనందపరిచాయి.ప్రత్యేకంగా కార్గిల్ యుద్ధం, ఆపరేషన్ సింధూరు అంశాలపై ప్రదర్శించిన నాటికలు ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. కార్గిల్ యుద్ధంలో సైనికుల త్యాగాలు, దేశసేవ భావనలను చిన్నారులు హృద్యంగా ఆవిష్కరించగా, సింధూరు ప్రాధాన్యతను ప్రతిబింబించే ప్రదర్శన ఆకట్టుకుంది.ఈకార్యక్రమానికి కరస్పాండెంట్ పెద్దిటి బుచ్చి రెడ్డి హాజరై చిన్నారులను అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి బాలల రేపటి భావితరానికి మార్గదర్శకులు కావాలని,ఇంత డబ్బు నా ఆస్తిపాస్తులు ఎంతున్న చదువు ఉంటే అన్నీ ఉన్నట్టేనని, చదువును మించిన బలం లేదని, చదువుతోపాటు పిల్లలకు ఆటపాటలపై, క్రీడల పైన శ్రద్ధ చూపాలని ఇలాంటి కార్యక్రమాల వల్ల పిల్లలను ఉత్తేజ పరిచిన వాళ్ళమవుతామని, కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయ టీచర్లకు ఈ సందర్భంగా అభినందించారు. తెలిపారు. సందర్భంగా ప్రిన్సిపాల్ మనసా రెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు దేశభక్తి, సాంస్కృతి సాంప్రదాయాలను విలువల పెంపకానికి పాఠశాల కట్టుబడి ఉందన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్నారులను ప్రోత్సహించారు. కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా కొనసాగించారు.

## మహిళల భద్రతకు కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యం

- నిర్భయ ఫండ్ కింద 'ఇన్‌క్లూజివ్ సిటీస్' ప్రాజెక్టు ప్రారంభం
- పైలట్ ప్రాజెక్టుగా ములుగు జిల్లా ఎంపిక
- డీపీఆర్ తయారీపై మార్గదర్శకాలు
- మహిళలకు సురక్షిత పట్టణ వాతావరణమె లక్ష్యం



**ములుగు, ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):**మహిళల భద్రత, గౌరవం మరియు బారియర్ ఫ్రీ మొబిలిటీ అనే ప్రాజెక్టు లో భాగంగా కేంద్ర ప్రభుత్వం మహిళా & శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సిబ్బంది, మరియు రాష్ట్ర మహిళా & శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి మరియు డైరెక్టర్ ఔణ & జఔ, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు అమలుకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ (ఎజ) నిర్వహించారు, ఇందులో భాగంగా మహిళలు మరియు బాలికల భద్రతను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిరంతర చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో "ఇన్‌క్లూజివ్ సిటీస్ ఫర్ ఉమెన్ అండ్ గర్ల్స్" అనే ప్రత్యేక ప్రాజెక్టును నిర్భయ ఫండ్ క్రింద ప్రారంభించినట్లు వారు తెలిపారు. ఈ ప్రాజెక్టు ముఖ్యంగా ౹ఱవతీ–2 మరియు ౹ఱవతీ–3 పట్టణాల్లో అమలు చేయడానికి రూపొందించారని, దేశవ్యాప్తంగా పది నగరాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నట్లు, ఆ పది నగరాల్లో ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని ములుగు జిల్లా ను ఎంపిక చేసినట్లు వారు తెలియజేసారు. సమావేశంలో ప్రాజెక్టు అమలు విధానం, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీ, వివిధ శాఖల సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉన్నత స్థాయి నోడల్ అధికారిని నియమించడం, సంబంధిత శాఖలు మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ, పట్టణ స్థానిక సంస్థలు మరియు రవాణా శాఖ తదితర విభాగాల సమన్వయంతో డీపీఆర్ సిద్ధం చేయాలనీ వివరించారు. నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం అవసరమైన పత్రాలతో కూడిన డీపీఆర్‌ను వీలైనంత త్వరగా సమర్పించాలని సూచించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ములుగు జిల్లాలో మహిళలు మరియు బాలికలకు మరింత సురక్షితమైన, సౌకర్యవంతమైన మరియు సమాన అవకాశాలు కలిగిన పట్టణ వాతావరణాన్ని సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ములుగు జిల్లా కలెక్టర్ శ్రీ టి.ఎస్. దివాకర గారు వీడియో కాన్ఫరెన్స్ లో తెలిపారు.ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) శ్రీ సంపత్ రావు మరియు జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి ఈ.పి. ప్రేమలత పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో యునైటెడ్ టీమ్ వాల్ క్యాలెండర్ ఆవిష్కరణ...



**కరీంనగర్ టౌన్ ఫిబ్రవరి 25(పిసి డబ్ల్యూ న్యూస్):** యునైటెడ్ తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఫర్ మైనారిటీస్ (యునైటెడ్ టీమ్) ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మరియు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీ కిరణ్ బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా యునైటెడ్ టీమ్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ షేక్ నిసార్ అహ్మద్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా మైనారిటీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం యునైటెడ్ టీమ్ కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న మైనారిటీ ఉద్యోగులు తమ సమస్యలను యునైటెడ్ టీమ్ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ టీమ్ సెంట్రల్ యూనియన్ సభ్యుడు డాక్టర్ మహమ్మద్ అఖీల్ అహ్మద్, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ముబీన్ అహ్మద్, జిల్లా గౌరవ అధ్యక్షుడు సయ్యద్ అసద్, కార్యనిర్వాహక అధ్యక్షుడు మహమ్మద్ బషీర్ హుస్సేన్, కోశాధికారి మహమ్మద్ షారూఖ్ ఖాన్, అహ్మద్ ఖాన్ (ఎస్.టి.ఓ.), సయ్యద్ యూనుస్ (ఆర్గనైజింగ్ సెక్రటరీ), మహమ్మద్ కలీం మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు



**ఏటూరునాగారం:ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా కొనసాగుతున్నాయి. ఉదయం నుంచే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకుని క్రమశిక్షణతో పరీక్షలు రాస్తున్నారు.పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులకు తగిన మౌలిక సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఎలాంటి అసౌకర్యం కలగకుండా కాలేజీ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. హాల్ టికెట్ల పరిశీలన అనంతరం మాత్రమే విద్యార్థులను పరీక్షా గదుల్లోకి అనుమతించారు.పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టారు. దీంతో విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ప్రశాంతంగా పరీక్షలు రాస్తున్నట్లు కాలేజీ వర్గాలు వెల్లడించాయి.తల్లిదండ్రులు కూడా పరీక్షా కేంద్రం వెలుపల వేచి ఉండి విద్యార్థులకు మానసిక ధైర్యం కల్పిస్తూ మద్దతు అందించారు. మొత్తం మీద ఏటూరునాగారం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా కొనసాగుతున్నాయి.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన: మండల వ్యవసాయ అధికారి రూప



**కల్లూరు, ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పట్టణ పరిధిలో రైతు వేదిక నందు మండల వ్యవసాయ అధికారి రూప అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రూప మాట్లాడుతూ ప్రకృతి సేద్యం వలన నేల కాలుష్యం, వాతావరణం కాలుష్యం తగ్గి పంట నాణ్యత సూక్ష్మజీవుల లభ్యత పెరుగుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై వైరా కెవికె శాస్త్రవేత్త ఫణిశ్రీ సేంద్రియ వ్యవసాయానికి అవసరమైనటువంటి వర్మి కాంపోస్ట్, గోమూత్రం, ఘన జీ వామృతం, ద్రవ జివామృతం, పుల్లటి మజ్జిగ, బ్రహ్మాస్త్రం దశపర్ణిక, నీమాస్త్రం ఆధారిత శీఘ్రకారకాలు తయారీ వాడకం గూర్చి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమానికి కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజా ప్రభాకర్ చౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొని సేంద్రియ సాగు ఆవశ్యకతను వివరించి రైతులకు మట్టి నమూనా పత్రాలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బత్తలపల్లి, సిఆర్పి లు, రైతులు పాల్గొనడం జరిగింది.

# కాప్రా ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

**• అధ్యక్ష కార్యదర్శులుగా మెరుగు చంద్రమోహన్, ముత్యం ముఖేష్ గౌడ్**






**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,ఫిబ్రవరి 25,(పిసిడబ్ల్యూ న్యూస్):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ లోని కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ బుధవారం టిఎస్ఐఐసీ కాలనీలోని ప్రెస్ క్లబ్ లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సలహాదారులు ఏంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్, అధ్యక్షులుగా మెరుగు చంద్రమోహన్, ఉపాధ్యక్షులుగా దిలీప్ కుమార్, యావాపురం రవి, దొమ్మాటి కిరణ్ కుమార్, గార్లపాటి శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శిగా ముత్యం ముఖేష్ గౌడ్, సంయుక్త కార్యదర్శిగా డి. శ్రీనివాస్, కె. వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కోశాధికారిగా రామచంద్రమూర్తి, కార్యవర్గ సభ్యులుగా గంగి కృష్ణ, గోవిందు కుంట్ల ఆంజనేయులు, బుడంపల్లి నిరంత్ గౌడ్, తొడుపునూరు బాలకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మెరుగు చంద్రమోహన్, ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారి రామచంద్రమూర్తి మాట్లాడుతూ కాప్రా ప్రెస్ క్లబ్ జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తమను కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారిగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో నూతన సభ్యులకు సభ్యత్వాలను అందజేయనున్నట్లు తెలిపారు. **ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి అభినందనల వెల్లువ** కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు. అధ్యక్షులుగా మెరుగు చంద్రమోహన్,ప్రధాన కార్యదర్శిగా ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారిగా రామచంద్ర మూర్తిలతో పాటు కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం పేరుపేరునా అభినందనలు తెలిపారు. ఏఎస్ రావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, పజ్జూరి పావనిరెడ్డి, కొత్త రామారావు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి,

# జ్వరంతో అలమటించిన చత్తీస్‌గఢ్ వలస కార్మికుడు

**కర్రకు జోల కట్టి రెండు కిలోమీటర్లు మోసిన సహచరులు కదిలించిన దృశ్యం**



**కాకతీయ, ఏటూరునాగారం:ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా నూగురు వెంకటాపురం మండలం పరిధిలో వలస కూలీల దుస్థితి మరోసారి వెలుగులోకి వచ్చింది. పనుల నిమిత్తం చత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వచ్చిన ఓ వలస కూలీ తీవ్ర జ్వరంతో అస్వస్థతకు గురయ్యాడు. నడవలేని స్థితిలో ఉన్న అతడిని, సహచర కూలీలు ఒక కర్రకు జోల కట్టి సుమారు రెండు కిలోమీటర్ల మేర మోస్తూ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్దకు తీసుకొచ్చారు. ఈ హృదయ విదారక దృశ్యం అక్కడున్న స్థానికులను కలచివేసింది.వెంటనే స్పందించిన స్థానికులు 108 అంబులెన్స్ సేవలకు సమాచారం అందించగా, సిబ్బంది తక్షణమే అక్కడికి చేరుకుని బాధితుడిని సమీపంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం అతడికి చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.ఈ ఘటనతో వలస కూలీలకు సరైన నివాస, వైద్య సదుపాయాల లేమి స్పష్టమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో పనిచేస్తున్న వలస కార్మికుల ఆరోగ్య భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, శాశ్వత ఏర్పాట్లు చేయాలని వారు కోరుతున్నారు.



# బంజారాల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి







**అన్ని రంగాలలో బంజారా కులస్తులు అభివృద్ధి చెందాలి**

**సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంను అనుసరించాలి: మంత్రి సీతక్క**

**ములుగు జిల్లా,ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలోని బంజారా కులస్తుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అన్ని రంగాలలో బంజారా కులస్తులు అభివృద్ధి చెందాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుదవారం రోజున ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ గుడి హరిత హోటల్ పక్కన తెలంగాణ ప్రభుత్వం సద్గురుసంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ గారి ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ గారి 287వ జయంతి కార్యక్రమం అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, మున్సిపల్ చైర్మన్ చింత నిప్పుల చంద్రకళ బిక్షపతి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీతక్క మాట్లాడుతూ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం హర్షించదగ్గ విషయమని, బంజారా కులస్తులు భవన నిర్మాణం ఏర్పాటు చేసుకోవడానికి ప్రత్యేక స్థలాన్ని కేటాయించడం జరిగిందని వివరించారు. రానున్న రోజులలో ప్రభుత్వం బంజారాలా సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. సీతక్క బంజారా భాషలో మాట్లాడి అబ్బురపరిచారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కలెక్టర్ చదువు వలననే ఏ జాతి అయినా బాగుపడుతుందని, చదువు, ఆరోగ్యం మీద శ్రద్ధ కనబరచాలని, అభివృద్ధి చెందిన వారు మిగతా వారి ఉన్నతికి పాటుపడాలని, మనం ఏం చేయాలన్న వారి స్ఫూర్తి తీసుకొవాలన్నారు. జిల్లాలో గిరిజన అధికారులు సామాజిక అభివృద్ధి అంశాలలో చొరవ తీసుకోవాలని, సంత్ సేవాలాల్ చూపిన ఆశయాలను అందరి సహకారంతో సాధించాలని, గిరిజన జాతి అభ్యున్నతికి పాటుపడాలని అన్నారు. ముందుగా ములుగు బంజారాల కుల పెద్ద పోరిక గోవింద్ నాయక్ మాట్లాడుతూ బంజారాలకు మద్దిమడుగు లో 20 ఎకరాల స్థలంలో గుడి నిర్మాణం కోసం కేటాయించినందుకు, ములుగు జిల్లా గట్టమ్మ వద్ద సుమారు 20 గుంటల స్థలం, ఆలయ నిర్మాణం కోసం పూర్తి సహకారాలు అందిస్తానని తెలిపినందుకు ములుగు జిల్లా బంజరాల తరఫున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి మరియు మంత్రి సీతక్కకు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు పోరిక గోవింద్ నాయక్, పూజారులు రమేష్ గిరి మహారాజ్, కిషన్ మహారాజ్, ఐటిడిఏ అధికారి జనార్ధన్, రాహుల్, బంజారా కులస్తులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన భార్యాభర్తలను పరామర్శించిన ఎమ్మెల్యే

**- మానవత్వాన్ని చాటుకున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డిలు**






**తొర్రూరు ప్రతినిధి, ఫిబ్రవరి 24(పిసిడబ్ల్యూ న్యూస్):** సాటి మనిషి ఆపదలో ఉన్నారంటే మనకెందుకులే అని వదిలేసి రోజులువి. మానవతా దృక్పథంతో కలిగిన వ్యక్తిగా వ్యవహరించి ప్రాణాలకు ప్రాధాన్యత ఇచ్చిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డిలు. వివరాలలోనికి వెళితే నెల్లికుదురు మండలం ఆలేరుకు చెందిన మడిపల్లి యాకయ్య, అతని భార్య రజిత ఒక శుభకార్యానికి వెళ్లి వరంగల్ నుండి వారి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్న క్రమంలో వెలికట్టే ప్రాంతంలో రోడ్డుపై అదుపుతప్పి కిందపడి గాయాల పాలయ్యారు. అదే సమయంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ,టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి తొర్రూర్ పట్టణంలో తమ అధికార కార్యక్రమాలు ముగించుకొని పాలకుర్తి వైపు ప్రయాణిస్తుండగా మార్గమధ్యంలోని భార్యాభర్తలు ఇద్దరు గాయాల పాలైన వారిని గమనించి వెంటనే వారి వద్దకు వెళ్లి పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండల పోలీస్ స్టేషన్ కు ఫోన్ చేసి గాయాలైన భార్యాభర్తలకు తక్షణమే అత్యవసర వైద్య సేవలు అందించాలని వారికి సమాచారాన్ని ఇచ్చారు. మహిళా కానిస్టేబుల్ తో పాటు హెడ్ కానిస్టేబుల్ రవీందర్ గాయాలతో బాధపడుతున్న భార్యాభర్తల ఇద్దరిని ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి హెడ్ కానిస్టేబుల్ రవీందర్ దగ్గర ఉండి వారికి వైద్య పరీక్షలు అందించేందుకు సహాయపడినారు. సంఘట నా స్థలంలో భార్యాభర్తలను చూసి చెల్లించిపోయిన ఎమ్మెల్యే మానవజాత దృక్పథంతో ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నందుకు సంఘటన స్థలంలో చూసిన స్థానికులు, ప్రజాప్రతినిధులే కాకుండా ప్రతి ఒక్కరు కూడా వారి స్పందనకు ప్రశంసలు కురిపించారు. ప్రభుత్వ ఆసుపత్రికి ఫోన్ చేసి భార్యాభర్తలిద్ద ఇరువు రికి మంచి వైద్యం చేయాలని వైద్యులకు సూచించారు. మడిపల్లి యాకయ్యకు మామూలు గాయాలు కాగా భార్య రజితకు తలపై గాయం భుజంపై ,మరో గాయం కావడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు .వృత్తిరీత్యా మడి పల్లి యాకయ్యఆటో డ్రైవర్..

# ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులకు అండగా ఉంటాం

**• సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ • కూల్చినచోటే పేదలకు ఇల్లు నిర్మించి ఇవ్వాలి**



**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులకు సిపిఎం పార్టీ అండగా ఉంటుందని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. ఖమ్మం కొత్త కలెక్టర్ ఆఫీస్ పక్కన ప్రభుత్వ భూదాన భూముల్లో గత 13 సంవత్సరాల నుండి ఇల్లు నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్న నిరుపేదలకు భూములను పక్కా చేయాల్సింది పోయి, సౌకర్యాలు కల్పించాల్సింది పోయి వారిపై ప్రభుత్వం పోలీస్ యంత్రాంగంతో దాడిచేసి బుల్డోజర్లతో కట్టుకున్న ఇల్లు నేలమట్టం చేయడం సరైంది కాదని, అదే ప్రభుత్వ భూమిలో పక్కా గృహాలు నిర్మించి అన్ని సౌకర్యాలు కల్పించి వారికి ఇవ్వాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యురాలు మాచర్ల భారతీయ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పార్టీ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ... భూదాన ఉద్యమం సందర్భంగా వెలుగుమట్ల ప్రాంతంలోని భూదాన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం జరిగింది. అట్టి ప్రభుత్వ భూమిలో నిరుపేదలైన ప్రజలు 2013లో ఇల్లు నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్నారు. చుట్టుపక్కల చిన్నచిన్న పనులకు పోతూ బ్రతుకుతున్నారు. పేద ప్రజలు ఏ ఆధారంలేని వారు. ప్రభుత్వమే పట్టాలిచ్చి ఐదు లక్షల రూపాయలతో గృహాలు నిర్మించి చేయాల్సింది పోయి వారి ఇండ్లను కూల్చి నిర్వాసితుల మార్చడం సరైనది కాదని ఆయన అన్నారు. ఒకవైపున ప్రభుత్వం నిరుపేదలకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇస్తామని ఉచిత హామీలు ఇస్తూ మరొకవైపు ఆధారం లేక ఇండ్లు వేసుకున్న వాళ్ళని అత్యంత క్రూరంగా కూల్చివేయటం సరైనది కాదని అన్నారు. కొంతమంది ప్రైవేటు వ్యక్తుల పోద్బలంతో ఇది చేయటం పేదలకు అన్యాయం చేయటం అని ఆయన అన్నారు. కూల్చివేసిన స్థలాల్లో పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వేల ఎకరాల భూములను కార్పొరేట్ సంస్థలు ఉచితంగా ఇస్తున్న ప్రభుత్వం, 70 గజాల స్థలంలో ఇల్లు కట్టుకున్న నిరు పేదలపై నిర్బంధాన్ని విధించడం సరైంది కాదన్నారు. కూల్చివేసిన ఇళ్లకు వెంటనే నష్టపరియాలు ఇవ్వాలని ఆయన సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నివాసితులకు కల్పిస్తున్నటువంటి సౌకర్యాలు అన్నీ కూడా సక్రమంగా ఇవ్వాలని, వస్తువులకి అన్నింటికీ కూడా నష్టపరిహారం చెల్లించాలని ఆయన అన్నారు. ఈ భూదాన భూముల నిర్వాసితులకు సిపిఎం పార్టీ వారి పోరాటానికి అన్ని రకాలుగా సహకరిస్తుందని ఆయన సందర్భంగా అన్నారు. పేదల పట్ల ప్రభుత్వాలు తీసుకున్న వైఖరిపై ఆయన మండిపడ్డారు. జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్యాణ వెంకటేశ్వరరావు, బండి రమేష్, వై విక్రమ్, భూక్య వీరభద్రం, అంతు రాంబాబు, ఎర్ర శ్రీనివాసరావు, మాదినేని రమేష్, బండి పద్మ, మడుపల్లి గోపాలరావు, పెరుగు సత్యనారాయణ ఇతర జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గ్రామీణ వికాసం, రైతుల సంక్షేమమే మోదీ ప్రభుత్వ ధ్యేయం

**ఉపాధి హామీలో విప్లవాత్మక మార్పులు!**

**యూరియా పంపిణీలో కాంగ్రెస్ సర్కార్ ఘోర వైఫల్యం..**

**భూదాన్ బాధితులకు తక్షణమే న్యాయం చేయాలి!**

**మీడియా సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బసవపురం లక్ష్మీనారాయణ, బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు**



**ఖమ్మం,ప్రతినిధి ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** రైతులు, పేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం అని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బసవపురం లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని మినర్వా గ్రాండ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 'వికసిత్ భారత్ 2047' లక్ష్యంగా గ్రామాల్లోని వ్యవసాయ కూలీల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేంద్ర ప్రభుత్వం వినూత్న సంస్కరణలు తీసుకువచ్చిందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని పక్కదారి పట్టించి నిధులు దుర్వినియోగం చేసిన నేపథ్యంలో, పారదర్శకతను పెంచేందుకు సరికొత్త చట్టాన్ని తీసుకువచ్చినట్లు ప్రకటించారు. ఈ చట్టం ద్వారా ఉపాధి హామీ పని దినాలను 100 నుంచి 125 రోజులకు పెంచడంతో పాటు, ప్రత్యేకంగా 60 రోజులు వ్యవసాయ పనులకు కేటాయించడం రైతాంగానికి ఎంతో మేలు చేస్తుందని ఆయన వివరించారు. రాష్ట్రంలో ఎరువుల పంపిణీ కోసం ప్రవేశపెట్టిన యాప్ విధానంపై అధికారులకు కనీస అవగాహన లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, యాప్‌ల పేరుతో రైతుల ప్రాణాలతో చెలగాటం ఆడటం మానుకుని సాంకేతిక లోపాలు సవరించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఉపాధి హామీ పథకం కోసం కేంద్రం ఏకంగా రూ.1,51,282 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని, అందులో దాదాపు 95 వేల కోట్ల రూపాయలను అంటే 60 శాతాన్ని కేంద్రమే నేరుగా భరిస్తోందని ఆయన కుండబద్దలు కొట్టారు. మరోవైపు రైతులపై ఆర్థిక భారం పడకుండా మోదీ ప్రభుత్వం ఏటా రూ.1,25,000 కోట్ల భారీ సబ్సిడీతో ఎరువులను అందిస్తూ అండగా నిలుస్తుంటే, ఆ యూరియాను పారదర్శకంగా రైతులకు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. పాలకుల చేతకానితనం, అధికారుల నిర్లక్ష్యం వల్లే సబ్సిడీ యూరియా అంతా బ్లాక్ మార్కెట్ పాలవుతోందని, ఎక్కడా అవినీతి జరగకుండా ఆన్‌లైన్ పంపిణీ వ్యవస్థను కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర అధికారులదేనని ఆయన డిమాండ్ చేశారు.అనంతరం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నిప్పులు చెరిగారు. ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ముఖం చాటేస్తోందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రైతు భరోసా కింద ఇస్తామన్న నిధులు ఏమయ్యాయని ప్రభుత్వాన్ని నిలదీశారు. అన్నదాతలకు హామీ ఇచ్చిన విధంగా రైతు భరోసా అమలు చేయడంలో రేవంత్ సర్కార్ ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. మాట తప్పి మడమ తిప్పిన కాంగ్రెస్ నాయకులకు ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం నగరంలో నిరుపేదలైన భూదాన్ భూముల బాధితులపై ప్రభుత్వం కనబరుస్తున్న అమానుష వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు. దశాబ్దాల క్రితం దాతలు ఎంతో ఉదారంగా కటిక పేదల ఇళ్ల కోసం భూదాన్ యజ్ఞ బోర్డుకు ఇచ్చిన భూములలో, గుడిసెలు వేసుకుని జీవిస్తున్న వారిపై అకారణంగా దాడులు చేయడం దారుణమన్నారు. కనీస ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండానే బుల్డోజర్లతో దాడులు చేసి దాదాపు 800 నిరుపేద కుటుంబాలను రాత్రికి రాత్రే రోడ్డున పడేయడం ఈ ప్రభుత్వ రాక్షసత్వానికి పరాకాష్ట అని ఆరోపించారు. ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి, ఖమ్మం జిల్లా ఇంచార్జి ప్రభారి బద్దం మహిపాల్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, నాయకులు ఒక్క లంక సుబ్రహ్మణ్యం, గంట్యాల విద్యాసాగర్, మందడపు సుబ్బారావు, గుత్తా వెంకటేశ్వరరావు, నాయుడు రాఘవరావు, వీరవల్లి రాజేష్ గుప్తా, అల్లిక అంజయ్య, విజయ్ రాజు, నరుకుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## నీటి సంపులో పడ్డ ఆవు. .. రక్షించిన అగ్నిమాపక శాఖ



**ఏపీ: అన్నమయ్య జిల్లా: పుంగనూరు: ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** మేత కోసం వెళ్ళిన వావు ప్రమాదవశాత్తు 15 అడుగుల నీటి సంపులో పడిపోయిన ఘటన పుంగనూరు పట్టణం కోనేటిపాళ్యం సమీపాన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఆఫీసర్ తమ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రజల సహకారంతో తాళ్లు నిచ్చెనలను ఉపయోగించి సంపులో నుంచి ఆవును సురక్షితంగా బయటికి తీశామని ఆయన అన్నారు.

# దేవాలయంలో కొలువుదీరిన దేవతామూర్తులు

**భక్తులతో జనసముద్రంగా మారిన దేవాలయ ప్రాంగణం**

**ఖమ్మం, ప్రతినిధి ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం ఏదులాపురం నూతన మున్సిపాలిటీ పరిధిలోని వెంకటగిరి 13వ వార్డు ప్రాంతంలో నిర్మించిన దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ మహోత్సవం కార్యక్రమం జరిగినది.వేలాదిగా తరలివచ్చిన భక్త ల మధ్య. వేద పండితుల మంత్రోచరణలతో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట. ఘనంగా నిర్వహించబడింది. ప్రధాన ఆలయంలోశ్రీ శ్రీశ్రీ..గోవిందమాంబ సమేత. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి. కొలువుదీరగా ఉప ఆ పాలయాలల్లో. శ్రీ గణపతి. శ్రీ షిరిడి సాయిబాబా.. శివాలయ ప్రాంగణంలో శివలింగం నందీశ్వరుని ప్రతిష్ట చేశారు. దేవతామూర్తులు భక్తులు కోరిన కోరికలు తీర్చి. భక్తుల నిత్య సేవలు అందుకునే విధంగా ఆలయాన్ని దినదిన అభివృద్ధి చిందే విధంగా భక్తులను కాపాడుకుంటూ నిత్య పూజలు అందుకోవాలని దేవాలయ కమిటీ వారు.ఆధ్యాత్మిక వాతావరణంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య దేవతా విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఉదయం పుణ్యాహవచనం, గణపతి హోమం,




కలశస్థాపన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం ప్రధాన విగ్రహ ప్రతిష్ట.లను సంప్రదాయబద్ధంగా పూర్తి చేశారు. ధ్వజస్తంభ ప్రతిష్ట విశేష.శ్రద్ధతోనిర్వహించారు.ఈ మహోత్సవానికి పరిసర ప్రాంతాల నుండి వేలాదిమంది భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. దేవాలయ కమిటీ సభ్యులు సమిష్టి కృషితో. ఈ కార్యక్రమాన్ని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసి తరలివచ్చిన భక్తులకు అన్న ప్రసాదాలను అందించి భక్తుల మన్ననలను పొందారు ఈ కార్యక్రమానికి, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొని.మహోత్సవం కార్యక్రమా విజయవంతంగా నిర్వహించగా, భక్తులు భారీగా పాల్గొని భోజన ప్రసాదాన్ని స్వీకరించారు. కమిటీ సభ్యులు ముఖ్యంగా అతిథిగా హాజరైన. మద్దులపల్లి మార్కెట్ చైర్మన్.



కమిటీ వారికి అండగా నిలిచి మూడు రోజులుగా కార్యక్రమంలో పాల్గొని తన వంతు సహాయ సహకారాలు అందించి కమిటీ వారికి అండగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో. వార్డు కౌన్సిలర్లు. బైరు కోటేశ్వరరావు కందుకూరి శేషమ్మ వెంకటనారాయణ. గ్రామ పెద్దలు. సిహెచ్ వెంకట్ నారాయణ తదితరులు కమిటీ సభ్యులు. బైరు హరినాథ్ బాబు . బండారి ఉదయ్ కుమార్. దగ్గుల అంజిరెడ్డి.. బండారి వెంకటరామయ్య. ఉరిమెళ్ళ వెంకటేశ్వర్లు. బండ్ల లింగా చారి. తమ్మి పిచ్చయ్య చారి. రాయల శ్రీనివాసరావు. కల్లూరి ఉపేంద్ర చారి. బండ్ల వెంకటాచారి. పేర బోయిన శ్రీనివాసరావు. ఉరిమెళ్ళ లక్ష్మణ చారి. గ్రామ పెద్దలు భక్తులు వేలాదిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# హంస వాహనంపై వీణాపాణి



**ఏపీ: అన్నమయ్య జిల్లా: పుంగనూరు: ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** పుంగనూరు టీటీడీ పరిధిలోని శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవములు ఘనంగా నిర్వహిస్తున్నామని టెంపుల్ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. అందులో భాగంగా రెండవ రోజు సాయంత్రం స్వామి వారు సరస్వతీ అలంకారంలో వీణాపాణియై హంస వాహనంపై భక్తులను కటాక్షించారు.అత్యంత పవిత్రమైన హంస వాహనంపై కనువిందు చేశారు. జ్ఞానానికి, స్వచ్ఛతకు ప్రతీకగా భావించే ఈ వాహనంపై స్వామివారు వీణాపాణియై, భక్తులకు కటాక్షాన్ని అందిస్తూ పట్టణంలోని పుర వీధుల్లో ఊరేగారు.

# అరుదైన గౌరవం

**● వరంగల్ ఎంపీ డా.కడియం కావ్యకి అంతర్జాతీయ పార్లమెంటరీ బాధ్యత ● ఇండియాసౌదీ అరేబియా పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ సభ్యురాలి గా ఎంపికైన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**



**హన్మకొండ,ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):**వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కి అరుదైన గౌరవం దక్కింది. ఇటీవల ఏర్పాటు చేసిన ఇండియాసౌదీ అరేబియా పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ సభ్యురాలి గా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ని గౌరవనీయ లోక్‌సభ స్పీకర్ నామినేట్ చేశారు. ఈ మేరకు లోక్‌సభ సెక్రటేరియట్ (కాన్ఫరెన్స్ అండ్ ప్రోటోకాల్ బ్రాంచ్) అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. భారతదేశం సౌదీ అరేబియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడం, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించడమే లక్ష్యంగా ఈ పార్లమెంటరీ ఫ్రెండ్ షిప్ గ్రూప్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, ఈ బాధ్యత తనకు అప్పగించినందుకు లోక్‌సభ స్పీకర్ కి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కృతజ్ఞతలు తెలిపారు. భారత్‌సౌదీ అరేబియా మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా పార్లమెంటరీ స్థాయిలో తన వంతు కృషి చేస్తానని ఎంపీ స్పష్టం చేశారు. ఈ నామినేషన్ వరంగల్ పార్లమెంట్ నియోజక వర్గానికి గర్వ కారణమని, అంతర్జాతీయ పార్లమెంటరీ వేదికపై తెలంగాణకు మరింత గుర్తింపు తీసుకువస్తుందని ఎంపీ అభిప్రాయపడ్డారు.


# నిట్ వరంగల్‌లో మొదలైన స్ప్రింగ్ స్ప్రీ 2026 సాంస్కృతిక వేడుకలు







**హన్మకొండ,ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** నిట్ వరంగల్ విద్యార్థుల సృజనాత్మక ఆత్మస్ఫూర్తి మరియు సాంస్కృతిక ఉత్సాహానికి ప్రతీక అయిన స్ప్రింగ్‌స్ప్రీ 2026 సాంస్కృతిక వేడుకలు తొలి 'కర్టెన్ రైజర్' కార్యక్రమం విశేష ఆకర్షణగా మొదలయ్యాయి. 40 అడుగుల ఎత్తైన ఉత్సవ బ్యానర్‌ను అధికారికంగా ఆవిష్కరించగా, ఐదు నిమిషాల పాటు సాగిన అద్భుతమైన బాణసంచా ప్రదర్శన క్యాంపస్ లో ప్రతి ఒక్కరి మొహాల్లో వెలుగులు విరజమ్మాయి. అనంతరం నిర్వహించిన 'ఎథ్నిక్ నైట్' సాంస్కృతిక మహోత్సవానికి ముఖ్య అతిథిగా ఎన్ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి మాట్లాడుతూ,"స్ప్రింగ్‌స్ప్రీ మా విద్యార్థుల సృజనాత్మక ఆత్మస్ఫూర్తి మరియు సాంస్కృతిక ఉత్సాహానికి ప్రతీక. ఇది కేవలం ఒక కార్యక్రమం కాదు; ప్రతిభ, జట్టు భావం, నాయకత్వానికి వేడుక. నిర్వహణ బృందానికి నా శు భాకాంక్షలు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులంతా ఒక్క నిట్ వరంగల్ కుటుంబంగా కలిసి ఈ పండుగను జరుపుకోవాలని ఆహ్వానిస్తున్నాను" అన్నారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, స్ప్రింగ్‌స్ప్రీ 2026కు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు సహా వేలాది మంది అంతర్గత భాగస్వాములు పాల్గొంటున్నట్లు స్టేడియం, ఆడిటోరియం, ఎస్ఏసీ, ఏఎల్‌సీ మరియు అకడమిక్ భవనాల్లో ఒకేసారి అ ఉత్సవం సురక్షితంగా, సాఫీగా జరిగేందుకు పూర్తి సంస్థాగత సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఎస్ఏసీ అధ్యక్షుడు ప్రొఫెసర్ పి. హరి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, ఈ అద్భుతమైన వేడుకకు మద్దతు ఇచ్చిన ఎస్‌బీఐ, అజారా హాస్పిటల్, మింత్రా, చాయ్ షాట్స్ తదితర స్పాన్సర్లకు మా కృతజ్ఞతలు" తెలిపారు. ఈ ఉత్సవం సమగ్ర విద్యార్థి అభివృద్ధికి సంస్థ ఇచ్చే ప్రాధాన్యతను ప్రతిబింబిస్తుందని ఆయన అన్నారు. సమన్విత్ రెడ్డి, మహాదేవ్ మాట్లాడుతూ: "స్ప్రింగ్‌స్ప్రీ క్యాంపస్ లో ప్రతి ఒక్కరి కోసం. సంగీతం, కళ, ఫోటోగ్రఫీ, సాహిత్యం లేదా పోటీలు ప్రతి విద్యార్థికి తన వేదిక ఇక్కడ లభిస్తుందని స్వర్ణోత్సవానికి భారీ స్థాయి స్టేజ్ ఏర్పాట్లు, ప్రొఫెషనల్ సౌండ్ & లైటింగ్ సిస్టమ్స్, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు మరియు క్యాంపస్ అంతటా సమన్వయ ఏర్పాట్లతో స్ప్రింగ్‌స్ప్రీ 2026 నిట్ వరంగల్ లో ఒక మైలురాయి సాంస్కృతిక వేడుకగా నిలిచిపోనున్నట్లు తెలిపారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, "స్ప్రింగ్‌స్ప్రీ 2026కు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు సహా వేలాది మంది అంతర్గత భాగస్వాములు పాల్గొన నున్నారు. స్టేడియం, ఆడిటోరియం, ఎస్ఏసీ, ఏఎల్‌సీ మరియు అకడమిక్ భవనాల్లో ఒకేసారి అనేక కార్యక్రమాలు జరుగుతాయి" అని తెలిపారు.




# హత్య కేసులో నిందితురాలును అరెస్ట్ చేసిన హసన్ పర్తి పోలీసులు

**హన్మకొండ,ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):**సిద్దాపూర్ గ్రామంలో బాల్నే మొగిలి తన ఇంటి వెనకాల మరణించి ఉన్నాడని తన కొడుకు బాల్నే రాజకుమార్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన హసన్ పర్తి ఇన్స్పెక్టర్ వట్టే చేరాలు దర్యాప్తు నిర్వహించి, బుధవారం నిందితురాలు వంగ ఇందిర తండ్రి: లేట్ నారాయణ, వయస్సు: 48, కులము: గౌడ ను నమ్మధగిన సమాచారం మేరకు వంగపహాడ్ గ్రామ శివారులో ఓ ఆర్ ఆర్ దగ్గర అరెస్టు చేసి విచారించి ఆమె హత్యకు ఉపయోగించిన కత్తినీ స్వాధీనం చేసుకోవడం జరిగింది. వివరాల్లోకి వెళ్ళినట్లయితే వంగ ఇందిర కు గత 30 సశీ.రాల క్రితం వివాహం జరిగి విడాకులు జరిగినవి. అప్పుడు తన భర్త తరపు వారు విడాకులు సమయంలో తిరిగి ఇచ్చిన డబ్బులు సుమారు 60,000 వేల రూపాయలు తన బావ అయిన బాల్నే మొగిలి తన వద్ద ఉంచుకొని అప్పటినుంచి వాటిని ఇస్తా అనుకుంటూ ఇవ్వకుండా వాడుకున్నాడు. అదే క్రమంలో తన అక్క అయిన బాల్నే సరోజిన గత మూడు నెలల క్రితం మరణించగా తన బావ అయిన బాల్నే మొగిలి సొంత గ్రామమైన సిద్ధాపూర్ కు వచ్చి ఒకటే ఇంట్లో ఇద్దరు ఉంటుండగా ఈ డబ్బుల విషయం అడగగా తనను తిట్టుతూ ఇంట్లో నుండి వెళ్లిపోవాలని చాలాసార్లు గొడవ చేయగా బాల్నే ఇందిరా ఎలాగైనా తన బావ బాల్నే మొగిలినీ చంపాలని పథకం ప్రకారం మంగళవారం ఉదయం సుమారు 6 నుండి 7 గంటల మధ్యలో బాల్నే మొగిలి లేచి కాలకృత్యాలు తీర్చుకునే సమయంలో ఇంటి వెనకాల మొగిలిని వెనక నుండి నెట్టివేసి కింద పడవేసి రాయితో, కత్తి, కర్రతో, విచక్షణారహితంగా ముఖం పైన దాడి చేసి బాల్నే మొగిలి చనిపోయినాడని నిర్ధారించుకొని ఇంట్లో నుండి వెళ్ళిపోగా బుధవారం హసన్ పర్తి పోలీసులు అరెస్టు చేశారు.

# మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

## హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి

### హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై వివిధ శాఖల అధికారులు, యూనివర్సిటీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో జిల్లాస్థాయి కమిటీ సమావేశం



**హన్మకొండ,ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు పోలీస్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణ కు సంబంధించిన వివిధ శాఖల అధికారులు, యూనివర్సిటీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కూడిన జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు వివిధ శాఖలు తీసుకుంటున్న చర్యల గురించి శాఖల వారీగా చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై వీలైనంత ఎక్కువగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యార్థులు, వారి తల్లి దండ్రులకు నిర్వహించే సమావేశాల్లోను మత్తు పదార్థాల వాటిల్లే అనర్థాలపై అవగాహన కల్పించాలని డీఈవో కు సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమావేశంలో పాల్గొనేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో నెలలో ఒకరోజులో కొంత సమయాన్ని మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేవిధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. కళాశాలల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. హాస్టల్స్ లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అన్నారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాలు విక్రయించే వారి సమాచారాన్ని అందజేయాలని సూచించారు. వివిధ శాఖల సమన్వయంతో డ్రగ్స్ నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో పరకాల ఆర్డీవో డాక్టర్ కన్నం నారాయణ, డీఈవో ఎల్. వి. గిరిరాజ్ గౌడ్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, హనుమకొండ, కాజీపేట, పరకాల ఏసీపీలు నరసింహారావు, ప్రశాంత్ రెడ్డి, సతీష్ బాబు, ఎన్సీడీపీఓ డాక్టర్ శ్రీనివాస్, డీ డబ్ల్యు ఓ విశ్వజ, కేఎంసీ నుండి డాక్టర్ సంధ్య, డాక్టర్ అనిత రెడ్డి, ఎన్ఐ టీ , కేయూ, ఎస్సార్ యూనివర్సిటీలతో పాటు కిట్స్, వివిధ శాఖల అధికారులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవు

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- బాల్య వివాహాలపై అవగాహన కై ప్రచార రథం ప్రారంభం.
- బాల్యావా వివాహాల నిర్మూలన మనందరి బాధ్యత.
- చిన్నారుల బాల్యాన్ని పరిరక్షించుకుందాం



**హన్మకొండ,ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** బాల్య వివాహాలను చేసిన ప్రోత్సహించిన చట్టపరమైన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం మహిళా శిశు సంక్షేమ శాఖ, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ షేర్ ఎన్టీవో మరియు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ వరంగల్ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన ప్రచార రథాన్ని వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, బాల్యం అమూల్యమైన దశ అని పేర్కొన్నారు. బాల్య వివాహాలు పిల్లల చదువు, ఆరోగ్యం, శారీరక–మానసిక అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని అన్నారు. చదువు మధ్యలో ఆగిపోవడం వల్ల జీవితాంతం ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని, బాలికల విద్యను ప్రోత్సహిస్తూ ఉచిత విద్యను అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డి సి పి రవి, ఏ. హెచ్. టి. యూ ఇన్స్ స్పెక్టర్ శ్యామ్ సుందర్, ఎస్.ఐ సుధాకర్, హెడ్ కానిస్టేబుల్ సమీయుద్దీన్, షేర్ స్వచ్ఛంద సంస్థ జిల్లాల కో –ఆర్డినేటర్ శిరీష, జ్యానేశ్వరి, జమున, ప్రశాంతి, కల్పన, గాయత్రి, చామంతి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కిట్స్ వరంగల్‌లో గిరిజన జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ కార్యకలాపాలపై మార్గ దర్శకత్వం, సాంకేతిక సెషన్ విజయవంతం



**హన్మకొండ,ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ లోని కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ (కిట్స్ వరంగల్)లోని సెంటర్ ఫర్ ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, రీసెర్చ్, అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ (సెంటర్ ఫర్ స్వేర్ ఆర్ ఇ), స్టూడెంట్ అలయన్స్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ లీడర్‌షిప్ కలిసి పాఠశాల పిల్లల కోసం ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ కార్య కలాపాలపై మార్గ దర్శకత్వం, సాంకేతిక సెషన్‌ను విజయవంతంగా నిర్వహించాయి అని మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్, సెంటర్ ఫర్ స్వేర్ ఆర్ ఇ అధిపతి ప్రొఫెసర్, డాక్టర్ కె. రాజ నరేందర్ రెడ్డి తెలిపారు. వరంగల్ జిల్లా కొత్త వాడలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల జూనియర్ కళాశాల నుండి 80 మంది విద్యార్థుల బృందం ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, అభివృద్ధి చెందుతున్న నైపుణ్యాలపై బలమైన ఆసక్తిని ప్రతిబింబిస్తుంది, అని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి మాట్లాడుతూ సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ మరియు గణితం రంగాల లోని చాలా మంది విద్యార్థులు తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తరించు కోవడానికి, వినూత్న మనస్తత్వాన్ని, జట్టు కృషిని మరియు కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని హైలైట్ చేశారు. ఈ అవసరానికి ప్రతిస్పందించడానికి, కిట్స్ వరంగల్ ఫౌండేషన్ లు డిజైన్ సవాళ్లు, హ్యాకథాన్ లు, స్టార్టప్ పోటీలు, కస్టమర్ ఐడియా, డిస్కవరీ ల్యాబ్‌లు మరియు విద్యార్థి ఆవిష్కర్తలకు మద్దతు ఇవ్వడానికి మరియు ప్రయోజనం చేకూర్చడానికి రూపొందించబడిన పిచ్ పోటీలను చేర్చడానికి వారి సహ–పాఠ్య ప్రణాళిక కార్యక్రమాలను విస్తృతం చేశాయి, ఈ మార్గదర్శక సెషన్ రియాలిటీ కనెక్టర్లు, ప్రాజెక్ట్ మేనేజర్లు, వ్యక్తులు ఆలోచనల కనెక్టర్లను వెల్లడిస్తుంది అని తెలిపారు. ఈ సందర్భంగా మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీకాంత్ పబ్బా మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యాల ద్వారా వారి సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి అత్యాధునిక ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ప్రణాళికలను కలిగించే సాంకేతిక పరిజ్ఞానాల రంగంలో తాజా ధోరణులు మరియు అను వర్తనాలపై విలువైన అంతర్దృష్టులను అందించారు. ఆయన వారి నైపుణ్యాన్ని కూడా పంచుకున్నారు, వినూత్న పరిష్కారాలను అన్వేషించడానికి విద్యార్థులను ప్రేరేపించారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్, సెంటర్ ఫర్ స్వేర్ ఆర్ ఇ–సెయిల్ నుండి విద్యార్థి ప్రతినిధులు, విద్యార్థి అధ్యక్షురాలు, ఈవెంట్ మేనేజర్, ఇడిసి, వైస్ ప్రెసిడెంట్, అన్ని అధిపతులు, అన్ని డీన్లు, కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ & పిఆర్‌ఓ డాక్టర్ డి. ప్రభాకరా చారి, 180 కంటే ఎక్కువ మంది విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.

# కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ కాలేజియేట్ ఎడ్యుకేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం







**హన్మకొండ : ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ కాలేజియేట్ ఎడ్యుకేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఛైర్మన్ డా. కె. సురేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశానికి టీచర్ ఎమ్మెల్సీ శ్రీ పి. శ్రీపాల్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భ ంగా ఎమ్మెల్సీ శ్రీ పి. శ్రీపాల్ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే బదిలీలు మరియు పదోన్నతులు చేపట్టాలని, ఉన్నత విద్యా రంగంలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. జాక్ ఛైర్మన్ డా. కె. సురేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న ఉద్యోగులు మరియు రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించి, వారికి రావలసిన ఆర్థిక ప్రయోజనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫస్ట్ జోన్ ఆర్‌జెడి కార్యాలయాన్ని వెంటనే వరంగల్‌కు మార్చాలని కూడా ఆయన కోరారు. అధ్యాపకులు కళాశాలలో ప్రవేశాలు పెంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జాక్ సెక్రటరీ జనరల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ గారు మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని, ఉద్యోగుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జాక్ అదనపు కార్యదర్శి ఎ. నాగరాజు గారు, సహా ఛైర్మన్లు ఎం.డి. సులేమాన్ గారు, ఇతర సంఘాల నాయకులు చిన్న, రామకృష్ణారెడ్డి, వెంకన్న, రవికుమార్, శాంతి, రమేష్, అనిల్ కుమార్, వెంకటరమణ, నవీన్, స్వరూప రాణి, షాహిన్, రజిత, అంజాద్, శోభన్ తదితరులు పాల్గొన్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం, గెస్ట్ లెక్చరర్ల సంఘం మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు, ఇతర ఉద్యోగ నాయకులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి గారు తెలంగాణ గవర్నమెంట్ కాలేజ్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ డైరీ మరియు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

# ‘రగ్బీ’ జాతీయ పోటీల్లో ‘కెజిబివి’ విద్యార్థినుల ప్రభంజనం





### పథకాలతో జిల్లాకు గర్వకారణమైన ముదిగొండ బాలికలు

### ఘనంగా సన్మానించిన పాఠశాల బృందం

### కెజిబివి స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిర



**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** జాతీయస్థాయి రగ్బీ పోటీల్లో ముదిగొండ మండలానికి చెందిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి) విద్యార్థినులు అద్భుత ప్రతిభను కనబరిచి రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఖ్యాతిని సొంతం చేసుకున్నారని కళాశాల స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిర అన్నారు. ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురంలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయం బాలికలు జాతీయస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొని విజయకేతనం ఎగురవేసి పాఠశాలకు తిరిగి వచ్చిన విద్యార్థినులను బుధవారం ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఓ ఇందిర మాట్లాడుతూడ తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన ‘ఖేలో ఇండియా ఉమెన్స్ రగ్బీ లీగ్‘ పోటీల్లో ముదిగొండ కెజిబివి విద్యార్థినులు అండర్–15, అండర్–18 విభాగాల్లో జాతీయస్థాయిలో మూడవ స్థానాన్ని సాధించి కాంస్య పథకాలను కైవసం చేసుకోవడం అత్యంత గర్వకారణమన్నారు. ప్రత్యేకంగా జి. కృతిక (9వ తరగతి), ఆర్. లాస్యశ్రీ (8వ తరగతి)లు కాంస్య పతకాలు సాధించడం ప్రశంసనీయమని తెలిపారు. అలాగే ఖమ్మం జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సబ్–జూనియర్ బాలికల విభాగంలో మొత్తం 11 మంది తృతీయ స్థానాన్ని సాధించగా, అందులో ఇద్దరు తమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఉండటం పాఠశాలకు, మండలానికి మరింత గౌరవాన్ని తీసుకువచ్చిందన్నారు. గ్రామీణ ప్రాంత బాలికలు జాతీయ స్థాయిలో రాణించడం ద్వారా క్రీడల్లోనూ తమ సత్తా నిరూపించారని, ఇది భవిష్యత్తులో మరెందరో విద్యార్థినులకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులను పాఠశాల, కళాశాల తరపున శాలువలతో సత్కరించి, వారి తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ పిల్లలమర్రి సునీత, ఉపాధ్యాయులు నిర్మల, సఫియా బేగం, యాస్మిన్, నాగమణి, జ్యోతి, స్వాతి, సుకన్య, రాధ, ఉమాదేవి, సుమలత (తెలుగు), సుజాత, రజిని, కవిత, సుమలత (ఫిజిక్స్), రేణుక, జిల్లా రగ్బీ కోచ్ రఘు నాయక్‌తో పాటు పాఠశాల, కళాశాల సిబ్బంది పాల్గొని విద్యార్థినులకు అభినందనలు తెలిపారు.

# ఆసుపత్రికి చేరుకుని పరామర్శించిన తెలంగాణ ఉద్యమకారులు

- ఉత్తమ వైద్యం అందించాలని వైద్యులకు విజ్ఞప్తి





**ఆత్మకూరు, ఫిబ్రవరి 25 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఆత్మకూరు గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు రేవూరి జనార్ధన్ రెడ్డి కుమారుడు ప్రశాంత్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ప్రస్తుతం ఎన్ ఎస్ ఆర్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. అలాగే గూడెపాడు గ్రామానికి చెందిన బింగి అనిత కూడా అదే ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న నేపథ్యంలో తెలంగాణ ఉద్యమకారుడు, రైతు విమోచన సమితి రాష్ట్ర మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు (నవత వెంకన్న) ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాధితుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రశాంత్ రెడ్డి, బింగి అనితలకు అత్యుత్తమ వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని వైద్య బృందాన్ని కోరారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెబుతూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నవత వెంకన్న వెంట తెలంగాణ ఉద్యమకారుల జిల్లా కార్యదర్శి ఇర్సడ్ల సదానందం, తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షులు ఎండి బాబు మియా, మండల ప్రధాన కార్యదర్శి దుంక దువ్వ రాజన్న, బింగి వేణు తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్ అన్యాయంపై బీసీల గళమెత్తింపు
# 27న ఇందిరాపార్క్ వద్ద నిరాహార దీక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి 25 (పీసీడబ్ల్యూ న్యూస్):** బీసీలకు బడ్జెట్‌లలో జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా 27న హైదరాబాద్‌లో నిరాహార దీక్షను జయప్రదం చేయండి గత కొన్ని సంవత్సరాలుగా బడ్జెట్‌లలో బీసీలకు అగ్రకుల పార్టీలు తీరని అన్యాయం చేస్తున్నాయని, దీనికి వ్యతిరేకంగా 27-02-2026 తేదీన (శుక్రవారం) హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ముందు బీసీ ఇంటెలెక్టువల్స్ ఫోరం (బీ సి ఐ ఎఫ్) వ్యవస్థాపక చైర్మన్ శ్రీ టి చిరంజీవులు ఐ ఏ ఎస్ (రిటైర్డ్) ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ఫోరం నాయకులు ప్రకటించారు. ఈ నిరాహార దీక్షలో బీసీలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయడం ద్వారా పాలకులకు గట్టి సందేశం ఇవ్వాలని బీసీ ఇంటెలెక్టువల్స్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ కే. వీరస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం బీసీఐఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర జనాభాలో మెజారిటీగా ఉన్న బీసీలకు వారి జనాభా నిష్పత్తి మేరకు బడ్జెట్ కేటాయింపులు చేయాలని, కేటాయించిన నిధులను సక్రమంగా విడుదల చేసి బీసీల అభివృద్ధికి ఉపయోగించాలన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న బీసీఐఎఫ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డాక్టర్ కూరపాటి




రమేష్ మాట్లాడుతూ,రాష్ట్రంలోని బీసీ సంఘాల నాయకుల్లో నిజాయితీ, నిబద్ధత కలిగిన ఉత్తమ నాయకత్వంగా శ్రీ టి చిరంజీవులు నిలిచారని ప్రశంసించారు. బీసీలపై రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న వివక్షను అరికట్టాలంటే చిరంజీవులు సార్ నాయకత్వాన్ని బలపరచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ నిరాహార దీక్షను విజయవంతం చేయాలని కోరారు. బీసీఐఎఫ్ కోర్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ బెనర్జీ మాట్లాడుతూ, నిజాయితీగా, నిక్కచ్చిగా, సూటిగా, స్పష్టంగా, అమ్ముడుపోకుండా నిలబడుతూ ఉద్యమాన్ని సరైన దిశలో నడిపిస్తున్న చిరంజీవులు సార్ నాయకత్వంలో, బీసీఐఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒక రోజు నిరాహార దీక్షను బీసీలందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మరో కోర్ కమిటీ సభ్యులు మండల పరిశరాములు మాట్లాడుతూ, బీసీలలో అత్యంత వెనుకబడిన ఎంబీసీలకు న్యాయం జరగాలంటే చిరంజీవులు సార్ నాయకత్వమే శరణ్యమని అన్నారు. చిరంజీవులు సార్ నాయకత్వంలో ప్రజాక్షేత్రంలో జరుగుతున్న మొట్టమొదటి పోరాటాన్ని ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ రాజ్ మహ్మద్, రవితేజ మొదలగు జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘన సన్మానం





**చిట్యాల ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు జన్నే యుగేందర్ ఆధ్వర్యంలో దొడ్డి కిష్టయ్య..గురుకుంట్ల కిరణ్ లకు సన్మానం చేసిన అనంతరం నంది అవార్డు గ్రహీత మిట్టపల్లి సురేందర్ , తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య మాట్లాడుతూ అంబేద్కర్ యువజన సంఘం లో దొడ్డి కిష్టయ్య గత 35 సంవత్సరాలుగా ప్రపంచ మేధావి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గారి ఆశయాలను కొనసాగిస్తూ ఆయన భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తూ ఇటీవల ఆలయ కమిటీ డైరెక్టర్ గా ఎన్నికైనందుకు కిష్టయ్యను అభినందిస్తూ తెలియజేశారు అలాగే ఇటీవల అంబేద్కర్ నేషనల్ అవార్డు అందుకున్న గురుకుంట్ల కిరణ్ అంబేద్కర్ ఆశలతో పాటు మహనీయుల భావజారాన్ని గ్రామాల్లోకి తీసుకెళుతూ వారిని చైతన్య పరచాలని అన్నారు. అనంతరం దొడ్డి కిష్టయ్య గురుకుంట్ల కిరణ్ లు సన్మానం చేసిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి పుల్ల ప్రతాప్ మిట్టపెల్లి మిత్ర మండలి అధ్యక్షుడు పుల్ల సతీష్ కుమార్ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గురుకుంట్ల కిరణ్ మాస్ రమేష్ గుర్రపు నరసయ్య ఎల్లారెడ్డి పల్లె మాజీ సర్పంచ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

# ఇంజనీర్ లీలా మోహన్ జీవితం ఆదర్శం

**ప్రజల పక్షాన పనిచేసే వాళ్ళు ఎప్పటికి చిరస్మరనీయులేే**

**లీలా మోహన్ 27వ వర్ధంతి సభలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు**

**అనాధాలకు అన్నదానం చేసి ఔదార్యం చాటుకున్న స్నేహితులు**

**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజల పక్షాన నిలబడి పని చేసే వాళ్ళు భౌతికంగా లేకపోయినా సమాజంలో చీరస్మరనీయులుగా నిలిచి పోతారని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు కొనియాడారు. ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్ అనాధ ఆశ్రమంలో బుధవారం జరిగిన పంచాయతీ రాజ్ ఇంజినీర్ అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షులు మురారీ లీలా మోహన్ 27వ వర్ధంతి సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. లీలా మోహన్ మిత్ర బృందం సభ్యులైనా సీనియర్ పాత్రికేయులు ఆకుతోట ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ వర్ధంతి సభలో ఆయన మాట్లాడుతూ, లీలా మోహన్ ఇంజనీర్ గా ప్రజలకు సేవలు అందిస్తూనే మరోవైపు సమాజంలోని అట్టడుగు వర్గాలకు చేయుటనిచ్చేవారని కొనియాడారు.







ఎంతకాలం జీవించామన్నది కాదు, ఎలా జీవించామన్నదే ముఖ్యమని ఆయన అన్నారు. చిన్న వయసులోనే లీలా మోహన్ మనకు దూరం ఐనప్పటికీ, ఆయన సేవలు కొనసాగించడం ద్వారా... ఆయన ఆశయాలు నెరవేర్చినవారి మవుతామవని అన్నారు. రెండు దశాబ్దాల క్రితం ఆయన స్వర్గీయులు ఐనప్పటికీ, లీలా మోహన్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాజంలో పేద వర్గాల అభ్యున్నతి కోసం పని చేయడం ద్వారానే మన జీవిత లక్ష్యం నెరవేరుతోందని, అలాంటి కోవకు చెందిన లీలా మోహన్ చీరస్మరనీయుడని పేర్కొన్నారు. ఇంజనీర్లతో పాటు మేదో సంపత్తి కలిగిన ప్రతి ఒక్కరూ, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రముఖ శ్రీకవిత విద్యాసంస్థల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్ మాట్లాడుతూ, ఈనాటి యువత విష సంస్కృతిని విడనాడి, తమ భవిష్యత్ కు బాటలు వేసుకోవాలని సూచించారు. అలాగే లీలా మోహన్ వలె, వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తూనే...తన చుట్టూ ఉన్న సమాజానికి ఉపయోగపడుతూ, మంచి పేరు సంపాదించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా లీలా మోహన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనాధలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్ ఇంజనీర్ తెనాలి సుబ్బారావు, కార్పొరేటర్ నాగుల్ మీరా, అన్నం ఫౌండేషన్ అన్నం శ్రీనివాసరావు, సీనియర్ పాత్రికేయులు బొల్లం శ్రీనివాస్(సాక్షి), కనకం సైదులు (10టివి), వెన్నబోయిన సాంబశివరావు(టి న్యూస్), జి.ప్రశాంత్ రెడ్డి(వెలుగు), శెట్టి రజినీకాంత్(ప్రైమ్ నైన్ టివి), బి.ఉదయ్(ఆర్టివి), వనం నాగయ్య(కెరటం), మందటి వెంకటరమణ(నమస్తే తెలంగాణ),మందుల ఉపేందర్(మెగా టివి), ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు(వార్త), కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, బండారి శేఖర్, పేరబోయిన తిరుపతిరావు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతి

- **భూదాన్ భూములపై ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని ఖండించిన కాంగ్రెస్ నేతలు**
- **నిజమైన పేదలకు తప్పకుండా న్యాయం చేస్తాం**
- **భూదాన్ భూములు ప్రైవేటు సంస్థలకు ఇవ్వడం అసత్యం**
- **రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు**



**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేదల పక్షాన నిలిచిందని, భూదాన్ భూముల విషయంలో ప్రతిపక్షాలు కావాలనే ప్రజలను తప్పుదారి పట్టించేలా దుష్ప్రచారం చేస్తున్నాయని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తీవ్రంగా మండిపడ్డారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ అంశంపై వారు స్పష్టమైన వివరణ ఇచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్ పాల్గొని మాట్లాడారు. వెలుగుమట్ల భూదాన్ భూములపై ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, అక్కడ నిజంగా పేదలు ఉంటే ప్రభుత్వం తప్పకుండా వారికి న్యాయం చేస్తుందని రాయల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. భూదాన్ భూములను ప్రభుత్వ అవసరాల కోసమే వినియోగిస్తామని, వాటిని ఏ ప్రైవేటు కంపెనీలకో అప్పగించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ జీవితంలో ఎక్కడైనా భూముల కబ్జాకు పాల్పడ్డారా? అని బిఆర్ఎస్ నాయకులను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం రాజకీయ దురుద్దేశమేనని విమర్శించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలోనే భూదాన్ భూముల ఆక్రమణలపై చర్యలకు ప్రయత్నం జరిగిందని, అప్పట్లో కోర్టు రెవెన్యూ అధికారులకు ఖాళీ చేయించే అధికారం లేదని తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం మాత్రం కోర్టు ఉత్తర్వుల మేరకు సీసీఎల్ఏ అధికారులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. గతంలో అక్కడ నిర్మాణాలు చేసుకున్న సుమారు పది మంది కోర్టును ఆశ్రయించగా వారికి మాత్రమే స్టే లభించిందని, మిగిలిన వారికి స్టే రాకపోవడంతో కోర్టు ఆదేశాల ప్రకారమే ఖాళీ చేయించడం జరిగిందన్నారు. కొంతమంది వ్యక్తులు దళారీలుగా మారి పేదలను మోసం చేస్తూ డబ్బులు తీసుకుని గుడిసెలు వేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు స్టే ఉన్న 10 ఇళ్లను మినహాయించి మిగిలిన అక్రమ నిర్మాణాలపై మాత్రమే చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. భూదాన్ భూముల వివాదం ఇప్పటిది కాదని, గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా ఇదే అంశంపై చర్యలు తీసుకునే ప్రయత్నం జరిగిందని, అప్పటి మంత్రి కూడా ఖాళీ చేయించే ప్రక్రియ ప్రారంభించలేదా? అని ప్రశ్నించారు. వాస్తవాలను తెలుసుకోకుండా బిఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. భూదాన్ భూముల అంశాన్ని రాజకీయంగా వాడుకుంటూ కల్వకుంట్ల తారక రామారావు వస్తున్నారని బిఆర్ఎస్ నాయకులు చెబుతున్నారని, వాస్తవాలు తెలుసుకోకుండా వస్తే ఆయనే అబాసుపాలు అవుతారని రాయల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఖమ్మం నియోజకవర్గానికి చెందిన వారు అక్కడ 40 మంది కూడా లేరని, నిజమైన పేదలను గుర్తించి వారికి తప్పకుండా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వెలుగుమట్ల భూదాన్ భూముల్లో నివాసం కోల్పోయిన సుమారు 30 నిరుపేద కుటుంబాలు జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి వచ్చి, నిజమైన పేదలకు ప్రభుత్వం తరఫున న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమకు అండగా నిలవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా ముక్తార్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పుచ్చలకాయల వీరభద్రం, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్యతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వెలుగుమట్ల బాధితులకు బాసటగా కేటీఆర్

**- నేడు ఖమ్మం పర్యటన**

**- పేదల గుండెలపై ప్రభుత్వ బుల్డోజర్లు**

**- ప్రభుత్వ విధ్వంసాన్ని ప్రశ్నించనున్న గులాబీ దళపతి**

**- ఎమ్మెల్సీ, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తాత మధుసూదన్**

**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజలను కాపాడాల్సిన ప్రభుత్వం, పేదల జీవితాలను ఛిద్రం చేస్తూ నిరంకుశ పాలనకు నాంది పలుకుతోందని ఎమ్మెల్సీ, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తాత మధుసూదన్ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తాత మధుసూదన్ మాట్లాడుతూ.. వెలుగుమట్లలో పేదల ఇళ్లపై జరిగిన బుల్డోజర్ల దాడి ఒక పరిపాలనా చర్య కాదని, అది పేదల జీవించే హక్కుపై జరిగిన క్రూరమైన దాడిగా అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 25 నెలల కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని, ఆ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ప్రతిపక్ష బిఆర్ఎస్‌పై బురదజల్లే కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. గత పదేళ్లుగా కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం సాధించిన అభివృద్ధిని ధ్వంసం చేయడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శలు గుప్పించారు. లగచర్లలో గిరిజన సోదరుల భూములను రియల్ ఎస్టేట్




వ్యాపారం కోసం లాక్కునేందుకు అర్ధరాత్రి పోలీస్, పారా మిలటరీ బలగాలతో దాడులు చేయడం, గర్భిణీలు, వృద్ధులను కూడా చూడకుండా అమానుషంగా ప్రవర్తించడం ఈ ప్రభుత్వ దమనకాండకు ప్రత్యక్ష ఉదాహరణలని నేతలు గుర్తు చేశారు. హైదరాబాద్‌లో 'హైడ్రా' పేరుతో నాలుగు దశాబ్దాలుగా నివసిస్తున్న పేదల ఇళ్లను కూల్చివేసి వేలాది కుటుంబాలను రోడ్డున పడేయడం ఇందిరమ్మ రాజ్యానికి సిగ్గుచేటన్నారు. "రేవంత్ అంకుల్ మంచి చేస్తారని ఓటు వేస్తే మా ఇళ్లనే కూల్చేశారు" అంటూ చిన్నారులు కన్నీళ్లు పెట్టుకుంటూ అడుగుతున్న ప్రశ్నలకు ఈ ప్రభుత్వానికి సమాధానం లేదని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. నిన్న ఖమ్మం నడిబొడ్డున వెలుగుమట్ల గ్రామంలో జరిగిన ఘటన మరింత హృదయ విదారకమని బిఆర్ఎస్ పేర్కొంది. భూదాన్ ట్రస్ట్ బోర్డు ద్వారా చట్టబద్ధంగా పట్టాలు పొంది, కొంతకాలంగా నివసిస్తున్న 1895 పేద కుటుంబాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని ఆరోపించారు. కోర్టు నుంచి స్పష్టమైన 'స్టేటస్ కో' ఆదేశాలు ఉన్నప్పటికీ, వేల సంఖ్యలో పోలీసులను మోహరించి యుద్ధ వాతావరణాన్ని సృష్టించి, మీడియాను అడ్డుకుని, ఎన్‌కౌంటర్ సీన్‌ను తలపించేలా బుల్డోజర్లతో ఇళ్లను కూల్చివేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకే అవమానమని మండిపడ్డారు. ఈ ప్రభుత్వ విధ్వంసానికి వ్యతిరేకంగా, వెలుగుమట్ల బాధితులకు భరోసా ఇచ్చేందుకు కల్వకుంట్ల తారక రామారావు, భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ఖమ్మం చేరుకోనున్నారు. వెలుగుమట్ల బాధిత కుటుంబాలను స్వయంగా పరామర్శించి, ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని కళ్లారా పరిశీలించనున్నారు. వెలుగుమట్ల బాధితులందరికీ తక్షణమే పునరావాసం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు, అలాగే మానవ హక్కుల ఉల్లంఘనపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. నేటి కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, నామా నాగేశ్వరరావుతో పాటు జిల్లా ముఖ్య నాయకులు పాల్గొననున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని, వెలుగుమట్ల పేదలకు అండగా నిలవాలని పార్టీ తరపున విజ్ఞప్తి చేశారు. ఈ మీడియా సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, భాషబోయిన వీరన్న, మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మక్బూల్, లీగల్ సెల్ నాయకులు, మైనారిటీ సెల్ ప్రతినిధులు, ఉద్యమకారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.